## విలేకరులు కావలెను

### పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :48 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 11 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

- ఇదే అదనుగా నాసా టెక్నాలజీ అంటూ నకిలీ ఏసీల అమ్మకం!
- యూకేలో పోర్టబుల్ ఏసీల పేరిట భారీ ఆన్‌లైన్ మోసం
- నాసా టెక్నాలజీ, 90 సెకన్లలో కూలింగ్ అంటూ తప్పుడు ప్రచారం
- ఇవి ఏసీలు కావు, కేవలం తడి అట్టలున్న ఫ్యాన్లు మాత్రమే
- ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక




## ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

- ఈ20 పెట్రోల్‌తో వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చు : కేంద్రం
- ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని వెల్లడి
- 2025-26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుంది





## ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయాలు
- ఔషధాల్లో 12 శాతానికి మించి ఆల్కహాల్ ఉంటే లైసెన్స్ తప్పనిసరి
- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి
- ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోంది

- కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ
- శ్రీవారిని దర్శించుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు
- బాలాజీ సేవలో పాల్గొన్న శ్రీలంక డిప్యూటీ కమిషనర్ గణేశనాథన్ గేతీశ్వరన్
- తీర్థప్రసాదాలను అందజేసిన ఆలయ అర్చకులు


**అమరావతి**

తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోందని కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ అన్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో మూలవిరాట్టు దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి వివరాలు 2లో..

## సోషల్ మీడియా దుర్వినియోగంపై

# ఉక్కుపాదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్




**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు. సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల వివరాలు 2లో..



## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

- చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్
- 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నామన్న మోదీ
- క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడి



## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

- బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం
- తొక్కిసలాట తర్వాత సీఎం హోదాలో తొలిసారి కరూర్‌కు విజయ్
- కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం

## మహిళలకు వెరీ ‘గుడ్డు’ ఉపాధి

- మూడో దశలో మరో 55 మందికి అవకాశం
- తొలిసారిగా గుడ్లతో తయారు చేసే ఆహార వంటకాల యూనిట్లు
- అతివలు ఆర్థికంగా బలోపేతం అవుతుండడంతో మూడో దశలో మరో 55 మందికి ఉచితంగా యూనిట్లు



**హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా ‘సర్’ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 98 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని.. ఈనెల 24వ తేదీ వరకు పత్రాల డిజిటల్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ రాకపోతే ఆగష్టులో ఫామ్ 6, 8 ఇస్తారని.. నింపి ఇవ్వాలన్నారు. ‘సర్’ ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త వివరాలు 2లో..

## ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి




- ఏపీలో ఆటోమోటివ్ ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం
- పుంగనూరులో ఈవీ క్లస్టర్, ప్రతి 30 కి.మీ.లకు ఒక ఛార్జింగ్ స్టేషన్
- కొరియా ఆటో ఇండస్ట్రీస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

**అమరావతి**

సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 కింద ఆంధ్రప్రదేశ్ లో విస్తృతమైన ఆటోమోటివ్ ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం, ఇందులో కొరియన్ సంస్థలు భాగస్వామ్యం వహించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్-సుంగ్ లీ వివరాలు 2లో..




## జాతీయ గీతం తప్పనిసరి!

- జాతీయ గీతం జనగణమన, వందేమాతరం ఆలాపనపై కేంద్రం కీలక ఆదేశాలు
- జాతీయ గీతం, జాతీయ గేయం ఆలాపనలో సరైన సాహిత్యం, ఉచ్చారణ తప్పనిసరి
- కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా మార్గదర్శకాల్ని పునరుద్ధాటించిన కేంద్రం

## ముత్తూట్ ఫైనాన్స్‌లో భారీ మోసం

- కస్టమర్ల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టు పెట్టిన మేనేజర్
- హైదరాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో వెలుగుచూసిన వైనం
- కస్టమర్ల బంగారాన్ని దుర్వినియోగం చేశారని బ్రాంచ్ మేనేజర్‌పై ఆరోపణ
- తక్కువ వడ్డీ ఆశ చూపి సొంత ఖాతాలకు డబ్బు మళ్లింపు
- మేనేజర్ ప్రియాంక రెడ్డిపై కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు



# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి

మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.

ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.



### భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

### అమరావతిపై కీలక నిర్ణయాలు

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

### విద్యారంగానికి పెద్దపీట

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

### టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅఛెవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

### సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

### భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

### మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.

విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.

తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

# ఏపీలో మాటల మంటలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన చారిత్రాత్మక విజయంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన తరుణంలో.. రాష్ట్ర రాజకీయాలు మునుపెన్నడూ లేనంతగా వ్యక్తిగత దూషణలు, శాంతిభద్రతల సవాళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలు రగిల్చేందుకు, శాంతిభద్రతల సమస్యలను సృష్టించేందుకు ఒక పక్కా వ్యూహం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమలోని రాప్తాడు ఫ్యాక్షన్ సెగల నుంచి కోస్తాలోని పెనుమలూరు పొలిటికల్ వార్ దాకా.. గత కొన్ని వారాలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు కేవలం స్థానిక వివాదాలు కాదని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించేందుకు ఒక పెద్ద పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్నారని అంటున్నారు. రాయలసీమ సున్నిత ప్రాంతాల్లో పాత కక్షలను మళ్లీ రగల్చడం. ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హఠాత్తుగా తెరపైకి వచ్చి.. దివంగత నేత పరిటాల రవి, ప్రస్తుత మంత్రి పరిటాల సునీతలపై అత్యంత ఘోరమైన, వ్యక్తిగత పదజాలం ఉపయోగించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ చరిత్ర ఉన్న అనంతపురం లాంటి జిల్లాలో ఇలాంటి ఉద్రేకం రేపే ప్రసంగాలు చేయడం వెనుక.. ఎలాగైనా స్థానిక కేడర్‌ను ఘర్షణల్లోకి నెట్టాలనే కుట్ర దాగుందని అనుమానిస్తున్నారు. కూటమి శ్రేణులు గనుక సహనం కోల్పోయి ఎదురుదాడి చేస్తే.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు, మాపై దాడులు జరుగుతున్నాయి అని ఢిల్లీ స్థాయిలో విక్టిమ్ కార్డ్ ప్లే చేసే వ్యూహంతోనే తోపుదుర్తి ఇలా రెచ్చగొడుతున్నారని అధికార పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. కృష్ణా జిల్లా కానూరు లో టీడీపీ జెండా దిమ్మెను ఉద్దేశపూర్వకంగా తొలగించిన వ్యవహారం దుమారం రేపింది. అమరావతిలోనూ వైసీపీ నేతల పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడింది. తమ నేతలపైనే దాడులు జరిగాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా రంగంలోకి రావడం ఈ పొలిటికల్ స్కెచ్‌లో భాగమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాలతో ఏమాత్రం



సంబంధం లేని ఇతర రాష్ట్రాల యూట్యూబర్లు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను టార్గెట్ చేస్తూ మహిళా నేతలపై అత్యంత జుగుప్సాకరమైన పోస్టులు పెట్టడం, విద్వేషాలను రేపడం పతాక స్థాయికి చేరింది. తాజాగా, దళిత క్రైస్తవ మీటింగుల ముసుగులో పవన్ కళ్యాణ్‌పై, రాజ్యాంగ వ్యవస్థలపై సాయుధ తిరుగుబాటును, నక్సల్స్ ఐడియాలజీని ప్రోత్సహిస్తూ వీడియోలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ పై గన్నవరం పోలీసులు కఠినమైన ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడం సంచలనంగా మారింది. ఈ అలజడి రాజకీయ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా కేవలం పరిపాలన, సంక్షేమంపైనే దృష్టి పెట్టి శాంతిభద్రతల విషయంలో కొంత ఉదారంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్న సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హోం శాఖకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాజకీయ నాయకుల ముసుగులో ఉన్నా సరే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హయాంలో జరిగిన రాక్రీట్ అవినీతి అక్రమాలపై, ఆస్తుల సీజింగ్‌పై లీగల్ ఫోకస్ పెట్టడంతో పాటు.. సోషల్ మీడియా విద్వేషకులకు మద్దతుగా నిలుస్తున్న నటుడు ప్రకాశ్ రాజ్, వైసీపీ సోషల్ మీడియా వింగ్‌పై లీగల్ నోటీసులు, అరెస్టుల పరంపర ప్రారంభం కానుందని భావిస్తున్నారు. ఏపీ రాజకీయాలు ఇప్పుడు కేవలం అభివృద్ధి-సంక్షేమం అనే చర్చల నుంచి మారి, వ్యవస్థల పరిరక్షణ-శాంతిభద్రతల అదుపు అనే దిశగా సాగుతున్నాయి. ప్రతిపక్షం ఎంతలా రెచ్చగొట్టినా.. కూటమి ప్రభుత్వం చట్టపరమైన ఆంక్షలు, ఉపా లాంటి కఠిన నిబంధనల ద్వారా అరాచకాలను అణచివేసేందుకే మొగ్గు చూపుతోంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే ఈ కఠిన చర్యలు అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసి రాష్ట్రాన్ని ప్రశాంత మార్గంలో ఉంచుతాయా.. లేక ప్రతిపక్షం మరింతగా సెంటిమెంట్ పాలిటిక్స్ తెరపైకి తెస్తుందా అనేది వేచి చూడాలి

## ఏపీలో జనాభా వృద్ధి కార్యక్రమం...

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండి, కాన్పుల మధ్య కనీసం రెండేళ్ల విరామం పాటించిన దంపతులకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 11వ తేదీ నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముగ్గురు పిల్లలున్న దంపతులను ప్రతి జిల్లాకు మూడు, అలాగే కాన్పుల మధ్య సరైన దూరం పాటించిన జంటలను ప్రతి జిల్లాకు ఆరు చొప్పున గుర్తించి రూ.5 వేల నగదు బహుమతి అందిస్తారు. ఒకవేళ అర్హులైన దంపతులు ఎక్కువగా ఉంటే లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని, అలాగే ఉత్తమ సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి కూడా పురస్కారాలు ఇస్తామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదలపై చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉందని చెప్పవచ్చు.

## ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి

-మొదటిపేజీ తరువాయి

నేతృత్వంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధిలో భాగంగా పూర్తి ఏపీఎస్ఆర్టీసీ ఫ్లీట్ విద్యుదీకరణ, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్లు, ఈ-మొబిలిటీ నగరాలకు ఈవీ ఆర్‌డీ గ్రాంటు, పుంగనూరు ఈవీ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈవీ మాగ్నెట్‌ల కోసం ఏపీలో కేంద్రప్రభుత్వ సహకారంతో రేర్ ఎర్త్ కారిడార్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ లో 100 కి.మీ.ల పరిధిలో ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నాం, ఇందులో కియా, దాని అనుబంధ సంస్థలతోపాటు అశోక్ లేలాండ్, ఇసుజీ మోటార్స్, హీరో మోటో కార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి ప్రధాన సంస్థలు అంతర్భాగంగా ఉన్నాయని చెప్పారు. అశోక్ లేలాండ్ సంస్థ 2,500 కోట్లతో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తోందని తెలిపారు.

కియా విజయగాథ మా కమిట్ మెంట్, శక్తి, సామర్థ్యాలకు నిదర్శనం. కియా క్లస్టర్ (అనంతపురం) సమీపాన ఒకటి, శ్రీసిటీ--చిత్తూరు--తిరుపతి కారిడార్ వెంబడి మరొక ప్రత్యేక కొరియన్ ఆటో కాంపోనెంట్స్ పార్క్ లు అభివృద్ధి చేస్తాం, ఇక్కడ ప్లగ్ అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టూలింగ్/టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సదుపాయాల కోసం ఒక కొరియా డెస్క్ ఏర్పాటుచేస్తామన్నారు. ఝూఉఊణజ ద్వారా పరిశ్రమకు అనుగుణంగా రూపొందించిన ప్రోగ్రామ్‌లు, కౌశలం ప్లాట్‌ఫామ్, సభ్య కంపెనీలతో కలిసి ప్రెస్/బాడీ/పెయింట్-షాప్ ఆపరేషన్స్ స్కిల్డ్ వర్క్ ఫోర్స్ తయారీలో కీలకపాత్ర వహిస్తున్నాయి. జుఎ పవర్‌ట్రెయిన్‌ల కోసం అకాడమీని ఏర్పాటుచేసి, కొరియన్-స్థాయి ఆటో నైపుణ్య శిక్షణకు కొరియన్ సంస్థలు ముందుకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం. ఇందుకోసం ఏపీలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోండి. దక్షిణ కొరియాతో ఆంధ్రప్రదేశ్ సంబంధాన్ని మరింత పటిష్టం చేస్తూ, ఝూజుణదీలో కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుచేస్తున్నట్లు లోకేష్ ప్రకటించారు.

## తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

తీర్థప్రసాదాలు అందజేశారు. క్షేత్ర నిర్వహణ అద్భుతంగా ఉందని మాంఝీ ప్రశంసించారు. "శ్రీవారి దివ్యమంగళ స్వరూపం దర్శించే భాగ్యం కలిగింది. తిరుమల వాతావరణం స్వర్గంలో విహరిస్తున్నట్లు ఉంది. ప్రపంచ నేతల మనసులు మారి శాంతిమార్గంలో నడిచేలా ప్రార్థించా."

కేంద్రమంత్రి మాంఝీని కలుసుకోవడం ఆనందంగా ఉంది: రాష్ట్రంలో ఏం.ఎస్.ఏం.ఈ శాఖలో మంచి విధానాలు తీసుకొచ్చేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్కీమ్స్ ఎలా అమలు అవుతున్నాయనే విషయాలను కేంద్రమంత్రి జితన్? రామ్? మాంఝీని అడిగి తెలుసుకున్నారన్నారు. ప్రజలను చైతన్యపరుస్తున్న కేంద్రమంత్రి మాంఝీని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

"ఎంఎస్ఎంఈ శాఖలో మంచి విధానాల కోసం కేంద్రం, రాష్ట్రం పని చేస్తున్నాయి. కేంద్ర పథకాల అమలుపై కేంద్రమంత్రి జితన్‌రామ్ మాంఝీ అడిగి తెలుసుకున్నారు." - కొండపల్లి శ్రీనివాస్, మంత్రి

శ్రీవారిని దర్శించుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు: తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సినీ, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీలంక డిప్యూటీ కమిషనర్ గణేశనాథన్ గేతీశ్వరన్, సంగీత దర్శకుడు తమన్, తమిళ నటుడు అథర్వ మురళీలు వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో వేర్వేరుగా పాల్గొన్నారు. ఆలయంలోకి వెళ్లిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని మట్నక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారిని దర్శించుకున్న లోక్?సభ సభ్యుడు: శ్రీవారిని లోకసభ సభ్యుడు బిప్లబ్ కుమార్ దేబ్ దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. కంపార్టుమెంట్లు అన్నీ నిండి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్?లో వేచి ఉన్నారు. జులై 9వ తేదీ గురువారం 70,141 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,821 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే, గురువారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు సమకూరినట్లు వెల్లడించారు.

## మహిళలకు వెరీ 'గుడ్డు' ఉపాధి



-మొదటిపేజీ తరువాయి

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం. దీనికోసం స్వయం సహాయక సంఘాలకు రుణాలతో పాటు ఉచితంగా యూనిట్లు కూడా అందిస్తోంది. తొలిసారిగా గుడ్లతో తయారు చేసే ఆహార వంటకాల యూనిట్లు విజయనగరం జిల్లాలో 40 మందికి ఇచ్చారు. రెండో దశలో 25 మందికి మంజూరు చేశారు. వీటితో అతివలు ఆర్థికంగా బలోపేతం అవుతుండడంతో మూడో దశలో మరో 55 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. వీటిని పీపీపీ విధానంలో ఎన్ఈసీసీ భాగస్వామ్యంతో అందజేస్తున్నారు. అర్హులను గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు.

వంటకాలు: షాహి అండా మసాలా, గుడ్డు పచ్చడి, ఎగ్ ఫ్రైడ్ రైస్, ఎగ్ పెప్పర్ మసాలా, ఎగ్ రోల్, ఎగ్ నూడుల్స్?, ఎగ్ బిర్యానీ, ఎగ్ కర్రీ, ఎగ్ ఫ్రై, ఆమ్లెట్, ఎగ్ 65, ఎగ్ పరోటా, గోంగూర విత్ ఎగ్ కర్రీ, ఎగ్ దోశ, ఎగ్ బజ్జీ, ఎగ్ బోండా తదితర వంటకాలు చేసుకోవచ్చు.

పోషకాలెన్నో: గుడ్లు పోషకాలకు నిలయాలు. ఇందులో తొమ్మిది రకాల మాంసకృతులు, అమైనో ఆమ్లాలు, బీ కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్ డి, ఖనిజాలు దండిగా ఉంటాయి. శరీరంలోని వివిధ కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించడంతో పాటు పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. గుడ్డులోని ల్యూటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కంటి వ్యాధులు రాకుండా తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికి ఇది దోహదం చేస్తుంది. రోజుకు ఒక్క గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం తగ్గుతున్నట్లు ఇటీవల ఓ పరిశోధనలో తేలింది.

ఇంటిపట్టున ఉంటూనే ఆదాయం: ఇంటి వద్దనే ఆదాయం పొందడానికి ఈ వ్యాపారం ఎంతగానో దోహదపడుతుందని నెల్లిమర్లకు చెందిన పలువురు మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణంతో పాటు స్త్రీనిధి నుంచి మరికొంత తీసుకుని, కుటుంబ సభ్యుల సహకారంతో దీన్ని విస్తరిస్తామని యూనిట్లు నిర్వహిస్తున్న మహిళలు వివరిస్తున్నారు. రోజుకు ఖర్చులు పోనూ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఆదాయం వస్తోందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇటువంటి వ్యాపారం వల్ల మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా వస్తుందని రేగిడికి చెందిన ఉపాధి పొందుతున్న మహిళలు తెలుపుతున్నారు. కావాల్సిన మొత్తం ముడి సరకులతో పాటు తయారు చేసే వస్తువులు కూడా ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇచ్చినట్లు వారు వివరిస్తున్నారు. తమలాంటి వారికి ఇవి ఎంతో ఉపయోగపడతాయని మహిళలు పేర్కొన్నారు.

# భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.





- గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.
- క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించ కుంటే సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవు.
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**మాడుగుల, పెన్ సత్తా, జులై 10 :** నియోజకవర్గ పరిధి లోని భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించకుంటే సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం మాడుగుల నియోజకవర్గం, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ లో ఒక నెల– ఒక నియోజక వర్గం– నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ లతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ

ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమం ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీల పై నిశితంగా సమీక్షించిన కలెక్టర్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల వేదికకు ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో రావడానికి ప్రధాన కారణం, క్షేత్రస్థాయిలో అధికారులు వారికి సమస్యల పైన సరైన అవగాహన కల్పించకపోవడమేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఏదో ఒక సమాధానం చెప్పి దరఖాస్తులను ముగించడం కాకుండా, సమస్యలను శాశ్వతంగా, చట్ట బద్ధంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, అధికారులు దీనిని గమనించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ

మాడుగుల గ్రీవెన్స్ సెషన్‌కు అనూహ్య స్పందన వచ్చింది అన్నారు. బాధితుల సమస్యల పై అధికారులు పాజిటివ్ దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

మాడుగులలో గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని, ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా




కొనసాగిందని వెల్లడించారు. మొదటి వారంలోనే 460 దరఖాస్తులు రాగా, రెండో వారమైన (శుక్రవారం) వచ్చిన 414 వాటితో కలిపి మొత్తం 814 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి అధికారులందరి సమష్టి సహకారం తోనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. మాడుగులలో మనం ఈ గ్రీవెన్స్ సెషన్స్ ఏర్పాటు చేసినప్పటి నుండి, దేవరపల్లి, కె.కోటపాడు, చీడికాడ వంటి అత్యంత మారుమూల ప్రాంతాల నుండి కూడా ప్రజలు ఎంతో నమ్మకంతో తరలివచ్చి తమ అర్జీలను సమర్పిస్తున్నారు. ఇక్కడికి వస్తే తమ సమస్యలు ఖచ్చితంగా పరిష్కారమవుతాయనే భరోసా వారిలో ఉంది. ఆ నమ్మకాన్ని అధికారులు, ప్రభుత్వం నిలబెట్టు కోవాలని అన్నారు. ఒక దరఖాస్తుకు రిపోర్టు రాసేముందు అధికారులు ఎటువంటి రాజకీయ, ఉన్నతాధికారుల ఒత్తిడిలకు లోను కాకుండా వాస్తవ రిపోర్టు మాత్రమే దరఖాస్తుదారులకు ఇవ్వాలని కోరారు. గతంలో ప్రజల వద్దకు పాలన జన్మభూమి రెవెన్యూ సదస్సులు వంటివి చేశామని, వాటన్నింటి కంటే ఈ కార్యక్రమం ఎంతో మంచి ఫలితాలను ఇస్తుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ మాట్లాడుతూ

గత రెండు వారాల మాడుగుల నియోజకవర్గంలో వచ్చిన గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి ఈ రోజుతో గడువు ముగుస్తున్నప్పటికీ, పెండింగ్ లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రతి ఒక్క దరఖాస్తు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. గ్రీవెన్స్ పరిష్కారాల పై వారం, వారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజల నుండి వచ్చే ప్రతి సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి, వీలైనంత త్వరగా వారికి న్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మాడుగులలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, డ్వామా, బీసీ వెల్ఫేర్, విద్యుత్ శాఖ, హౌసింగ్, పౌర సరఫరాలు, కో–ఆపరేటివ్, డి సి హెచ్ ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ, ఎండోమెంట్, వైద్య ఆరోగ్య శాఖ, ఫిషరీస్, మైనింగ్,





పంచాయతీరాజ్, ఎక్సైజ్ శాఖ, రిజిస్ట్రేషన్లు, డి ఆర్ డి ఏ, ఆర్ డబ్ల్యు ఎస్ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలు, పరిష్కరించిన అర్జీలు, మిగిలిన దరఖాస్తులు ఎప్పటిలోగా పరిష్కరించాలి అనే విషయాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కొన్ని మండలాల్లో గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కార ప్రగతి బాగుందని, అయితే మరికొన్ని మండలాల్లో ఇంకా పురోగతి సాధించాల్సి ఉందన్నారు. కొంతమంది అధికారులు పూర్తి సన్నద్ధతతో, నివేదికలతోరాగా, మరికొందరు ఆశించిన స్థాయిలో స్పందించ కపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ మండలాలకు సంబంధించిన వివిధ రకాల భూ–సర్వేలకు సంబంధించిన రికార్డులను, వీఆర్వోలను భూ నిర్వాహణ రికార్డులను సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సర్వే రిజిస్టర్లో ఎన్ని పాయింట్స్ ఉంటాయి, జమాబంది, అడంగల్, వాటికి సంబంధించిన వివరాల పై కూడా అవగాహన కలిగి ఉండాలని వీఆర్వోలను కోరారు. సర్వేకు సంబంధించిన పూర్తి వివరములతో వచ్చే వారంలో నిర్వహించే కార్యక్రమానికి రావాలని లేనిపక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వివిధ మండలాలలో ఓటరు జాబితా ఎస్ ఐ ఆర్ శాతాన్ని పిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు (ఎస్ఐఆర్) ప్రక్రియను బి యల్ ఓ లు క్రమశిక్షణతో పని చేయాలని, ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని బి యల్ ఓ లకు సూచించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చూడాలని ఈఆర్ఓ ఏఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి గత వారము నుండి ఎంతో శ్రమకోర్చి, ఈ కార్యక్రమానికి హాజరవుతున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇన్చార్జి డిఆర్ఓ, నర్సీపట్నం ఆర్డీఓ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, క్షేత్రస్థాయి మరియు గ్రామ స్థాయి నుండి వచ్చి సహకరిస్తున్న ప్రతి ఒక్క అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఇన్చార్జి డి ఆర్ ఓ, వై. శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డీఓ వెంకట రమణ లు వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హాజరైనారు.




# అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం...



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 10:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా విశేష సహాయం అందుతోంది. మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన అత్యవసర చికిత్స పొందిన 7 గురు లబ్ధిదారులుగాను రూ.3,01,443 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామ్కి జనసేన పార్టీ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రామ్కి మాట్లాడుతూ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. గత 24 నెలల కాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సహాయం అందేలా కృషి కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే చెక్కును అందజేసిన రామ్కి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో మిగిలిపోయిన రాగులను వెంటనే కొనుగోలు చేయాలి.

- మంత్రి కి వినతి పత్రం అందచేసిన మంత్రి సవిత.
- 15 రోజుల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి మనోహర్ హామీ.



**అమరావతి, పెన్ సత్తా, జూలై 10:** సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైతులు పండించి కొనుగోలు కాకుండా మిగిలిపోయిన రాగులను వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత ఐ జౌళి శాఖల మంత్రి సవిత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైతులు ఎంతో శ్రమించి పండించిన రాగుల్లో ఇప్పటికీ కొనుగోలు కాకుండా మిగిలిపోయిన నిల్వలను వెంటనే సేకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాగుల కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే పండించిన పంట నష్టపోకుండా అత్యవసరంగా ప్రొక్యూర్‌మెంట్ ప్రారంభించాలని మంత్రి సవిత కోరారు.

దీని పై సానుకూలంగా స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్ మిగిలిపోయిన రాగుల కొనుగోలు అంశాన్ని అత్యవసరంగా పరిశీలించి, 15 రోజుల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించేలా అవసర మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో మత ఘర్షణలకు వైసీపీ కుట్ర పన్నుతుంది సుందరపు.

వైసీపీ కుట్రలను ప్రజలు గమనించాలి.



**అచ్యుతాపురం, పెన్ సత్తా, జులై 10:** వాక్ స్వాతంత్రం అని కొందరు రాష్టంలో

సనాథన ధర్మమం, హిందుత్వం పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు అని యలమంచిలి నియోజకవర్గం శాసనసభ్యుడు సుందరపు విజయ్ కుమార్ విమర్శలు చేశారు. శుక్రవారం విజయ్ కుమార్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ అండతో

జడ శ్రవణ్ ఏలూరు లో దళిత క్రిస్టియన్ శంఖారావం సభ పెట్టి పవన్ కళ్యాణ్ ను టార్గెట్ చేస్తూ మాట్లాడారన్నారు. ప్రశ్న రావణ్, ప్రకాశ్ రాజు లకు అసలు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా అని ప్రశ్నించారు?. ప్రశ్న రావణ్, ప్రకాష్ రాజ్, జాడ శ్రవణ్ లు వైసీపీ జగన్ పెయిడ్ ఆర్టిస్ట్ లు అని ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశంలో, రాష్టంలో మతాలు, కులాలు మధ్య ఘర్షణలు సృష్టించాలన కుట్రలు జరుగుతున్నాయన్నారు.

రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రను పోలీసులు చేదించాలి అని విజ్ఞప్తి చేసారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలి అని విజయ్ కుమార్ కోరారు. రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించాలని ప్రయత్నం చేస్తున్న వారికి తాడేపల్లి నుంచి ఉన్న సంబంధాలు బయటపెట్టాలి. రాష్ట్రంలో అన్ని మతాలకు, కులాలకు కూటమి గౌరవం ఇస్తున్నాము. ధర్మస్థలి పై ప్రకాష్ రాజ్ కుట్రపన్ని దొరికిపోయారు.

హిందుత్వం, పవన్ కళ్యాణ్ పైన పనికట్టుకుని ప్రకాష్ రాజు మాట్లాడవలసిన అవసరం ఏముంది.

సుగాలి ప్రీతి కేసు ఒప్పుకొని జడా శ్రవణ్ ఆమెను మోసం చేయలేదా?.

జగన్ కు వ్యతిరేకంగా 25 కోట్లు కర్చుపెట్టానని అంటున్న జడా శ్రవణ్ కు ఆ డబ్బులు ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలి. ప్రశాంతంగా ఉన్న దేశాన్ని, రాష్టాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. సనాతన ధర్మం, హిందుత్వం పై కుట్ర పన్నితే వదిలే ప్రసక్తే లేదు అని విజయ్ కుమార్ హెచ్చరించారు.

# రామ్‌కీ ఫార్మా సిటీలో 767 కిలోల గంజాయి, హషీష్ ఆయిల్ దగ్ధం.

ఎన్సిబి, ఈగల్ వింగ్ సంయుక్తంగా నిర్వహణ.






**పరవాడ, పెన్ సత్తా, జులై 10:** మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సిబి), రాష్ట్ర ప్రభుత్వ ఈగల్ వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి.

రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో ఆరు వేర్వేరు కేసుల్లో ఎన్సిబి అధికారులు స్వాధీనం చేసుకున్న సుమారు 767.5 కిలోల గంజాయిని, 4.036 లీటర్ల హషీష్ ఆయిల్‌ను శుక్రవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. మండలం లోని తానం గ్రామం లోని 'రామ్‌కీ ఫార్మా' కంపెనీకి చెందిన అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ, బహిరంగంగా కాల్చకుండా మెషీన్ ద్వారా ఈ డ్రగ్స్‌ను నిర్వీర్యం చేశారు.

ఈగల్ ఎస్పీ జి.స్వరూప రాణి, ఎన్సిబి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేదిల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎన్సిబి సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఇంటెలిజెన్స్ ఆఫీసర్ కె.కిరణ్ బాబు, ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు జి.దేముళ్ళు, డాక్టర్ కల్యాణి, అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు, డ్రగ్స్ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్నాం అని అన్నారు. భవిష్యత్తు లోనూ ఇలాంటి తనిఖీలు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయి. పట్టుబడిన మత్తు పదార్థాలను ఎప్పటికప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తాం అని అధికారులు స్పష్టం చేశారు.

## అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన సతీష్ కుమార్.





**మునగపాక, పెన్ సత్తా, జులై 10:** మండలం లోని నాగులాపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణంలో

అబ్దుల్ కలాం విగ్రహా ఆవిష్కరణ చేసిన సుందరపు వెంకట సతీష్ కుమార్. శుక్రవారం అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11 వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర జనసేన పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ సుందరపు వెంకట సతీష్ కుమార్ పాల్గొని అబ్దుల్ కలాం విగ్రహా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, పిఎసిఎస్ పర్సనల్ ఇన్చార్జ్ ఎల్లప్ప వెంకట భాస్కర రావు, స్కూల్ కమిటీ చైర్మన్ పొలమర శెట్టి మురళి నూకాలయ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి ముసలి నాయుడు, అనకాపల్లి ఆవకాలవ చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసి నాయుడు, గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ జామి చిన్నమ్మలు, మాజీ ఉపసర్పంచ్ గోసాల గోవింద రాజు, కుర్రి సరోజినీ ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, కాళ్ళ చంద్ర మోహన్ సాలాపు మురళి, మోటూరు శ్రీ వేణి, చుక్క అనురాధ, సుందరపు ధనలక్ష్మి, కొయ్య రమణ, ఆడారి భాస్కర రావు, పల్లా సన్యాసి రావు తదుతరి కూటమి నాయకులు, కార్యకర్తలు, స్కూల్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు

# తేజ్ భరత్ ను తప్పించండి... వి.ఎం.ఆర్.డి.ఏ ను కాపాడండి.

- యాప్ ల పేరిట ఐదు కోట్ల భారం..
- కంప్యూటర్లు, డ్రోన్ కెమెరాల పేరిట పది కోట్లు.
- నియంతగా మారి అన్ని అధికారాలు చేజిక్కించుకున్న తేజ్ భరత్.
- ఆయన వల్ల దూరం అవుతున్న అధికారులు.
- చెక్ పవర్ కూడా తేజ్ భరత్ కే... ముడుపులు రమేష్ కు.
- విశాఖలో బ్యాంకు లేవి లేనట్టు రాజమండ్రి కోటక్ బ్యాంకుకు 75 కోట్ల ఎఫ్.డీ.
- ఎన్నడూ లేనంతగా ఆర్థికంగా సంక్షోభంలో వీఎంఆర్డీఏ.
- వి.ఎం.ఆర్.డి.ఏ ని ముంచుతున్న కమిషనర్ తేజ్ భరత్ పై విచారణ జరపాలి.
- జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 10:** విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) గా మారిన చారిత్రాత్మక మెట్రోపోలిటన్ కమిషనర్ తేజ్ భరత్ అవినీతి అక్రమాలు పెత్తందారీ విధానాల కారణంగా పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లిపోయింది అన్నారు జనసేన నేత పీతల మూర్తి యాదవ్. శుక్రవారం మూర్తి యాదవ్ జనసేన పార్టీ కార్యాలయంలో పత్రికాసమావేశం నిర్వహించి మాట్లాడుతూ అత్యంత నిజాయితీ పరులుగా పేరొందిన వీఎంఆర్డీఏ కి వందల కోట్ల ఆదాయాన్ని సమకూర్చిన బసంత్ కుమార్, యువరాజ్, విశ్వనాథన్ వంటి అధికారుల తర్వాత అత్యంత అవినీతిపరు డైన తేజ్ భరత్ ఇక్కడికి రావడం వి.ఎం.ఆర్.డి.ఏ మనుగడకే శాపంగా మారింది. తేజ్ భరత్ అవినీతి అక్రమాల కారణంగా విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వీఎంఆర్డీఏ ఇప్పుడు ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తేజ్ భరత్ అవినీతి అక్రమ వ్యవహారాలపై విచారణ జరిపి ఆయన పై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను అని యాదవ్ అన్నారు.

తేజ్ భరత్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వి ఎం ఆర్ డి ఏ దైనందిన వ్యవహారాల కోసం రాష్ట్ర ప్రభుత్వంలో ఏ శాఖకు లేని విధంగా డజనకు పైగా యాప్ లను తయారు చేయిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం కాకుండా కేవలం తన స్వార్థం కోసం తనకు బాగా తెలిసిన అమరావతి సాఫ్ట్ వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి కోట్లు కట్టబెట్టేందుకు మాత్రమే ఈ యాప్లను తయారు చేయిస్తుండడం గమనార్హం. నిర్మాణ్, పి.ఎం.ఎస్, విస్తా, తపాల్స్, వైబ్, అసెట్ 360, ఎల్.పి.ఎం.ఎస్ , వి టాస్క్ మేనేజర్, హెచ్.ఆర్.ఎమ్.ఎస్, అకౌంట్స్ వంటి పేర్లతో యాప్ లను తయారు చేయిస్తున్నారు. నిజానికి ఒక యాప్ తయారు చేయించడానికి రెండు నుంచి ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుంది. నిర్వహణకు మరో ఐదు లక్షలు ఛార్జ్ చేస్తారు. విచిత్రంగా వి.ఎం.ఆర్.డి.ఏ నే నిలువునా దోచేయటానికి వచ్చిన తేజ భరత్ మాత్రం యాప్ ల తయారీ నిర్వహణకు గాను సంవత్సరానికి ఏకంగా రెండు కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నారన్నారు. ఈ రెండు కోట్లతో కథ ముగియలేదని 53 లక్షల రూపాయల వ్యయంతో వీఎంఆర్డీఏ కేసుల వివరాలు తెలుసుకునేందుకు లా యాప్ ను ప్రత్యేకంగా రూపొందించారు. వీఎంఆర్డీఏకి లా సెక్షన్ ఉంటుంది దానికి అధికారులు సిబ్బంది ఉంటారు. వారి వద్ద ఫైల్స్ అన్ని సిద్ధంగా ఉంటాయి. జిల్లా కోర్టుతో పాటు హైకోర్టులో కూడా స్టాండింగ్ కౌన్సిల్ ఉంటుంది. అయితే విచిత్రంగా తేజ్ భరత్ ధన దాహంతో యాప్ తయారీకి 53 లక్షల రూపాయలు వెచ్చించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా నిర్వహణ కోసం ప్రతి నెల 2.50 లక్షల రూపాయలు ఆ యాప్ కోసం మూడేళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు.

గతంలో తేజ్ భరత్ మెప్మా ఎండిగా పనిచేసి అక్కడ కూడా చిత్ర విచిత్ర మైన యాప్ లతో ఉద్యోగులను వేధింపులకు గురి చేశారు. మెప్మాలో యాప్ లు తయారుచేసిన సంస్థని, అదే వ్యక్తులని ఇప్పుడు తేజ్ భరత్ వి ఎం ఆర్ డి ఏ కు తీసుకువచ్చి నిధులు వారి పేరిట కైంకర్యం చేసేస్తున్నారని యాదవ్ అన్నారు.

దృష్టి డ్రోన్ కెమెరాల పేరిట దోపిడి.

వీఎంఆర్డీఏ వుడా గా ఉన్నప్పుడే డ్రోన్ వంటి వాటి సాయం లేకుండా వందలు వేల లేవట్లను పరిశీలించి వాటికి అనుమతులు ఇచ్చింది. వందల కిలో మీటర్ల రహదారులు నిర్మించింది. తేజ్ భరత్ వచ్చిన తర్వాత వీఎంఆర్డీఏ సహజసిద్ధంగా చేసే ఈ పనులు అన్నింటిని ఓ డ్రోన్ సంస్థకు బదిలీ చేశారు. అవసరం ఉన్న లేకున్నా డ్రోన్లతో పని చేస్తున్నట్లు రికార్డులు సృష్టించి కోట్ల రూపాయలు ఆ సంస్థకు కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఏంట్రో ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్ అనే ఆ సంస్థకు దృష్టి డ్రోన్ కెమెరా పేరిట రెండున్నర కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించేశారు. ఇదే ఏంట్రో ల్యాబ్స్ సంస్థకు రూ.4.50 కోట్ల కంప్యూటర్ల కొనుగోలు కాంట్రాక్ట్. ఇదే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా మిగిలిన సంస్థల పీక నొక్కేసి 4.50 కోట్ల రూపాయల కంప్యూటర్ల కొనుగోలు కాంట్రాక్ట్ ఏకపక్షంగా ఇచ్చేశారు. వీఎంఆర్డీఏ కి అవసర మైన కంప్యూటర్లను గత ఏడాదే విశ్వనాథన్ కమీషనర్ గా ఉండగా మార్కెట్ రేటు కొని వినియోగిస్తున్నారు. కేవలం తన స్వార్థం కోసం అవసరం లేకుండా తేజ్ భరత్ నాలుగున్నర కోట్ల రూపాయలతో కొత్త కంప్యూటర్లు కొనుగోలు చేసి వీఎంఆర్డీఏ పై ఆర్థిక భారం వేశారు. కోటిన్నరకు వచ్చే ఈ కంప్యూటర్లను 4.5 కోట్లకు కొన్నట్లు చెబుతున్నారని యాదవ్ ఆరోపించారు. జిమ్ కూడా ఈ ఏంట్రో ల్యాబ్స్ సంస్థకే. రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా సంజీవిని పేరుతో వుడా ఉద్యోగుల కోసం ఉద్యోగ భవన్ తొమ్మిదవ అంతస్తులో ఏర్పాటు చేసిన జిమ్మును తన స్వార్థం కోసం తేజ భరత్ అక్కడి నుంచి తీసేశారు. వి.ఎం.ఆర్.డి తో కలిసి పని చేసే విశాఖ ఎకనామిక్ రీజియన్ (వి.ఈ.ఆర్) ఆఫీసుకు స్థలం కావాలంటూ జిమ్మును కొల్లగొట్టేశారు. అయితే నెలకు 3 లక్షల రూపాయలు ఆదాయం వచ్చే ఉద్యోగ భవన్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫర్నిచర్ షాప్ ని ఖాళీ చేయించి రెండు కోట్ల రూపాయల వ్యయంతో కొత్త జిమ్ ఏర్పాటు చేయించారు. పాత జిమ్మును యధావిధిగా తరలించ కుండా కొత్త జిమ్ ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో సాటి వి ఎం ఆర్ డి ఏ ఉద్యోగులకు అర్థం కాలేదు. 45 లక్షల రూపాయలతో పూర్తి కావాల్సిన జిమ్ కు రెండు కోట్ల రూపాయలు ఎందుకు వెచ్చించారో? ఆ కాంట్రాక్ట్ కూడా డ్రోన్లు, కంప్యూటర్ల సరఫరా చేసే ఎంట్రో ల్యాబ్ ఐటీ సొల్యూషన్ కి ఎందుకు ఇచ్చారో తేజ్ భరత్ కే అర్థం కావాలి. జిమ్ అవినీతి కథ ఇంతటితో ముగియలేదు. రెండు కోట్ల వ్యయం తో ఏర్పాటు చేసిన ఈ జిమ్ ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేయడం ద్వారా లబ్ధి పొందేందుకు తేజ్ భరత్ మరో కొత్త ఎత్తు వేశారు. కే.పి.ఎం.జి సంస్థకు నెలకు 30 లక్షలు. గతంలో వీఎమ్ఆర్డీఏ కమిషనర్ గా విశాఖ కలెక్టర్ గా అత్యంత నిజాయితీతో పని చేసిన యువరాజ్ ప్రస్తుతం విశాఖ ఎకనామిక్ రీజియన్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. నెలకు ఒకసారి ఒక గంట పాటు సమావేశం జరిగే వి.ఈ.ఆర్ కోసం ప్రత్యేక కార్యాలయం వద్దని సిబ్బందిని నియమించవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే యువరాజ్ కి తెలియకుండా తేజ్ భరత్ కే.పి.ఎం.జి సంస్థ నుంచి కొందరిని నియమించి వారికి నెలకు 30 లక్షల రూపాయలు జీతాలు చెల్లిస్తున్నారు. లక్షలలో జీతం తీసుకునే ఈ సంస్థ ఉద్యోగులు ప్రతిరోజు వీఎమ్ఆర్డీఏ కార్యాలయం కింద కాఫీలు, టీలు తాగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. దీని పై విచారణ జరిపి ప్రైవేటు ఉద్యోగుల స్థానంలో ప్రభుత్వ ఉద్యోగులనే నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని యాదవ్ సూచించారు. పది రూపాయల చెక్ పవర్ కూడా తేజ్ భరత్ కే. వుడాలో కానీ, వి ఎం ఆర్ డి ఏ లో కానీ గతంలో ఎన్నడు చెక్ పవర్ కమిషనర్లకు ఉండేది కాదు. వి.ఎం.ఆర్.డి.ఏ కు మొదటి నుంచి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్ట్ ఉంది. ఫైనాన్స్ విభాగం ఉంది. ఆర్థిక వ్యవహారాలు కమిషనర్, పాలకమండలి సిఫార్సులతో ఆ విభాగమే చూస్తుంది. అయితే తేజ్ భరత్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చెక్ పవర్ తో పాటు పూర్తి ఫైనాన్స్ అధికారాలు తన గుప్పెట పెట్టుకున్నారు. ఫైనాన్స్ విభాగం పైన కాకుండా కార్యదర్శి అధికారాలు ఇతర కీలక విభాగాల అధికారాలను కూడా బెదిరింపులతో హస్తగతం చేసుకుంటున్న తీరు నచ్చక పలువురు నిజాయితీపరులైన అధికారులు ఇప్పటికే వి.ఎం.ఆర్.డి.ఏ నుండి బయటకు వెళ్లారు. కొంతమంది సెలవు పై వెళ్ళిపోయారు. రాజమండ్రి కొటక్ మహేంద్ర బ్యాంకు కు 75 కోట్ల ఎఫ్.డి. గతంలో రాజమండ్రిలో జాయింట్ కలెక్టర్ గా పని చేసిన తేజ్ భరత్ ఇప్పటికీ రాజమండ్రి నుంచి బయటపడటం లేదు. వీఎంఆర్డీఏ కు పలువురు కాంట్రాక్టర్లను అక్కడ నుంచే తీసుకువస్తున్నారు. అంతటితో ఆగకుండా వీఎంఆర్డీఏ కి చెందిన 75 కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్ ను వీఎంఆర్డీఏ పరిధిలో లేని రాజమండ్రి కోటక్ మహేంద్ర బ్యాంక్ లో డిపాజిట్ చేయించారు. తన స్నేహితుడు అక్కడ ఉన్నాడు అన్న కారణంగానో లేక తనకు కమిషన్ వస్తుందన్న కారణంగానో ఈ పని చేసి ఉంటాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తేజ్ భరత్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంట్రాక్టర్లకు చెల్లించిన సుమారు 150 కోట్ల రూపాయల బిల్లుల పై విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తేజ్ భరత్ విశాఖలో ఆర్డిఓ గా పనిచేసినప్పుడు ఆయన దగ్గర పని చేసిన క్రింది స్థాయి అధికారి రమేష్ ఇప్పుడు వి ఎం ఆర్ డి ఏ లో చక్రం తిప్పుతున్నాడు. రమేష్ ను ప్రత్యేకంగా తేజ్ భరత్ తన సీ.సీ గా తెచ్చుకున్నారు. ముడుపులు వసూలు చేసే బాధ్యత ఇప్పుడు రమేష్ చూస్తున్నారని యాదవ్ ఆరోపణలు చేశారు. కాంట్రాక్టర్లకు లీజు దారులకు, లేఔట్ యజమానులకు ఫోన్లు చేసి భారీ మొత్తంలో వసూలు చేయటం, బెదిరింపులకు దిగటం రమేష్ విధి. కేవలం వసూళ్ల కోసమే రమేష్ ను ఆ పోస్టులోకి తెచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిక్స్ డిపాజిట్లకు రక్షణ కల్పించండి:

వీఎంఆర్డీఏకు 40 నుంచి 50 బ్యాంకు అకౌంట్లో ఉన్నాయి. వందల కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్లు ఉన్నాయి. తేజ్ భరత్ కమిషనర్ గా వచ్చిన వెంటనే వి ఎం ఆర్ డి ఏ నిర్వహించాల్సిన ఇతర పనులను పర్యవేక్షించడం మానేసి బ్యాంకు ఖాతాలు, ఫిక్స్ డిపాజిట్ల పై పడ్డారు. వీటి వివరాలను సేకరిస్తూ భారీ స్కాం కు తెరలేపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు తేజ్ భరత వ్యవహారాలపై దృష్టి సారించి వి ఎం ఆర్ డి ఏ బ్యాంకు ఖాతాలను, ఫిక్స్ డిపాజిట్ లను ఆయన భారీ నుంచి రక్షించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. వీఎంఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం విడిగా నిధులు ఇవ్వటం జీతాలు చెల్లించటం వంటివి చెయ్యదు. సొంత నిధులతోనే ఇది మనుగడ సాగించాలి. ఇందుకోసం సింకింగ్ ఫండ్ నిర్వహించాలి. తేజ్ భరత్ ను ఇలాగే వదిలేస్తే ఆ ఫండ్స్ కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉంది. అదే జరిగితే వి ఎం ఆర్ డి ఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. తేజ్ భర్తకు ముందు కమిషనర్ గా పనిచేసిన విశ్వనాథన్ అత్యంత నిజాయితీతో వీఎంఆర్డీఏకు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 300 కోట్ల రూపాయల ఆదాయాన్ని తీసుకొచ్చి పెట్టారు. తేజ్ భరత్ ఇప్పుడు దానికి ఎసరు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని పీతల మూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## పెదముసిడివాడ ప్రజా సమస్యల పై పరమేశ్వర రావుకు వినతిపత్రం.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 10:** అనకాపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ జనతా వారధి కార్యక్రమంలో పరవాడ మండలం పెదముసిడివాడ గ్రామ ప్రజల సమస్యల పై వినతిపత్రాన్ని అందజేశారు.

పరవాడ మండల బీజేపీ అధ్యక్షుడు పిల్లా సతీష్, మండల ప్రధాన కార్యదర్శి బంతిపూడి గోవింద రాజు లు పెదముసిలివాడ గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు, గ్రామానికి సమీపంలోని సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ద్వారపురెడ్డి పరమేశ్వర రావు మాట్లాడుతూ పెదముసిడివాడ గ్రామ తాగునీటి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే సమీప సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసర మైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గల్లా రాజేశ్వర రావు, బీజేపీ నాయకులు దాడి వీరు నాయుడు, కె. పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదమే



టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు

**నక్కపల్లి, పెన్ సత్తా జూలై 10:** అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యమే ఎంతో ఉత్తమమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి సభ్యులు కురందాసు నూకరాజు అన్నారు. మండలంలో జానకయ్య పేటలో వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కే రఘు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నూకరాజు మాట్లాడుతూ ఆయుర్వేద సేవలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, అనేక దీర్ఘకాలిక వ్యాధులను కూడా సునాయాసంగా నయం చేసుకోవచ్చునని, ఇటువంటి వైద్య సేవలను ప్రజలు ఆదరించాలని సూచించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 120 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.రఘు మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు పుష్కలంగా వున్నాయని చెప్పారు. ఆయుర్వేద మందుల వలన ఎటువంటి దుష్ప్రభావాలు వుండవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు నాగ సత్యవేణి, సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్ డీఎస్పీ సాయి తదితరులు పాల్గొన్నారు.

# లీప్ యాప్ తో ఎన్నో ప్రయోజనాలు



మండల విద్యాశాఖ అధికారి కె.నరేష్

**నక్కపల్లి, పెన్ సత్తా జూలై 10:** ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న లీప్ యాప్ ద్వారా విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని మండల విద్యాశాఖ అధికారి కె. నరేష్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాల, బోధిగల్లం హైస్కూల్ తో పాటు పలు పాఠశాలలను ఆయన సందర్శించి లీప్ యాప్ వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ లలో లీప్ యాప్ సంస్థాపన(ఇన్ స్టాలేషన్) చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఉపాధ్యాయులు దీనిపై మరింత శ్రద్ధ వహించి శతశాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులను దీనిపై చైతన్య పరచాలన్నారు. ఈ లీప్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడంద్వారా మొబైల్ లోనే విద్యార్థుల హాజరు,ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేసే విధానం, సకాలంలో సిలబస్ పూర్తి,మద్యాహ్న భోజన పథకం నిర్వాహణ వంటి విషయాలను తల్లిదండ్రులే నేరుగా తమ మొబైల్ లో తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు . ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు స్వయంగా తెలుసుకునేలా యాప్ రూపొందించడం శుభపరిణామం అని ఎం ఈ వో నరేష్ తెలిపారు. ఈ విద్యార్థుల పెన్ ఐడీ, పుట్టిన తేదీ ఆధారంగా ఓటిపి తో నిర్ధారణ చేసుకోవాలన్నారు.మండలంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల సహకారంతో వెంటనే ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పెదబోదుగల్లం హైస్కూల్ హెచ్.ఎమ్ .ఎస్.జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు,ఎస్.పాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన నిఖిల్







గీదృష్టివికలాంగ చిన్నారులకు అండగా నిలిచిన హోంమంత్రి తనయుడు

**నక్కపల్లి పెన్ సత్తా జూలై 10:.** ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత కుమారుడు నిఖిల్, తన పుట్టినరోజును భిన్నంగా, అర్థవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌ను సందర్శించిన నిఖిల్, దృష్టివికలాంగ చిన్నారులకు స్వయంగా పోషకాహారం, తాజా పండ్లు అందించారు. అంతేకాక, పాఠశాలకు 15 ఫ్యాన్లు, 25 కాట్ బెడ్స్‌ను కూడా అందజేసి, చిన్నారుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచారు. విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సమయం గడుపుతూ, వారి నవ్వుల్లోనే తన పుట్టినరోజు ఆనందాన్ని వెతుక్కున్నారు. ఆర్భాటాలకు దూరంగా, సేవలోనే సంతృప్తిని వెతుక్కున్న నిఖిల్ తీరు స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు,



# ఉమ్మడివరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు







**డి.వై.డి.ఓ.అండ్.హెచ్.ఓ.ప్రశాంతి,డి.ఎం.ఓ.భాస్కర్,రావు, సంబంధిత అధికారులు**

**-రేఖపల్లి,వైద్యశాల డాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద డాక్టర్, స్వర్ణలత,వైద్యశాల సిబ్బంది.**

**వి.ఆర్.పురం పెన్ సత్తా జూలై 10:**మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో శుక్రవారండి.వై. డి.ఓ.అండ్.హెచ్.ఓ.ప్రశాంతి,డి.ఎం.ఓ.భాస్కర్,రావు రేఖపల్లి,వైద్యశాల డాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద,డాక్టర్, స్వర్ణలత,వైద్యశాలసిబ్బంది.ఆధ్వర్యంలోశిబిరాన్ని,ఏర్పాటు చేసి,ప్రజలకు అవగాహణ,కల్పించారు.అనంతరం సంబంధిత,అధికారులుగృహాలవారిగాప్రజల ఆరోగ్య,సర్వే చేపట్టారు.గృహాలచుట్టూ ప్రతిఒక్కరూ పరిసరాల పరి శుభ్రత,ను,చూసుకోవాలని,ప్రతి ఒక్కరూ కాచి సల్లారిచి, గోరువెచ్చని,త్రాగునీరు,త్రాగాలి,గృహాలచుట్టూ నీటి గుంట లలో,నీరు నిలువఉండకుండాచూసుకోవాలి.నీరు నిల్వలు ఉన్నట్లయితే,అక్కడదోమలునివాసాలుఏర్పాటు చేసుకొని దోమలు,లార్వాద్వారాఅభివృద్ధి చెంది వాటి ద్వారా డెంగ్యూ,కారక దోమలు వ్యాప్తి చెందుతాయని,ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలంటూ,ప్రజలకు అవగాహన కల్పించారు.అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు నివారణకు హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేయడం,జరుగుతుందని,తెలిపారు.మండల ప్రజలు ఆరోగ్యంవిషయంలో,తగుజాగ్రత్తలు తీసుకుంటూ,ఆరోగ్యంగా ఉండాలని,కోరారు.ఈ వైద్యశిబిరంలో ప్రభుత్వ సంబంధిత,అధికారులు,రేఖపల్లి,వైద్యశాలడాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద,డాక్టర్,స్వర్ణలత,పి.హెచ్. ఎన్.భద్రకాళి,స్థానిక ఆశ వర్కర్ ఏ.ఎన్.ఎం.వైద్యశాల సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు

# లీప్ పాఠశాల గా కంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపిక.

హర్షం వ్యక్తం చేసిన ఎమ్ టి ఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కామేష్ రెడ్డి.



**కంచిలి పెన్ సత్తా జూలై 10::** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం లీపు పాఠశాల. దీని ముఖ్య ఉద్దేశం కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్ది,కార్పొరేట్ వ్యవస్థకు పోటీగా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి ప్రపంచ స్థాయిలో విద్యావ్యవస్థలో పోటీపడటమే దీని ముఖ్య ఉద్దేశం.ఇచ్చాపురం నియోజకవర్గము నుండి కంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఈ ప్రాజెక్టులో ఎంపిక చేయడం చాలా అభినందనీయమైన విషయం అని ఎం టి ఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ రెడ్డి పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ బెందాళం.అశోక్ బాబు చొరవతో కంచిలి స్కూల్ కు ఆ హోదా వచ్చిందని,కమిషనర్ తో స్వయంగా మాట్లాడి ఇక్కడ లీప్ స్కూల్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత గురించి ఎమ్మెల్యే తెలియజేసి ఒప్పించారు. అందుకు ఆయనకు పాఠశాల సిబ్బంది మరియు కంచిలి గ్రామ ప్రజలు తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని కామేష్ రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులకు డైరీలు పంపిణీ.

ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల.





**కవిట పెన్ సత్తా జూలై 10:**మండలంలోని బి.గొనపపుట్టుగ ఉన్నత పాఠశాల లో తమరాల. వేణుబాబు ఏ ఆర్ కానిస్టేబుల్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు డైరీలను అందించడం జరిగిందని హెచ్ఎం కే. వీరభద్రరావు తెలియజేశారు. మకరంపురానికి గ్రామానికి చెందిన తమరాల.వేణుబాబు ప్రతి ఒక్క విద్యార్థికి ఒక డైరీ ని అందించడం జరిగిందని, ప్రతి ఒక్క విద్యార్థి డైరీ సహాయంతో హోంవర్క్ అలాగే ఉపాధ్యాయులు చెప్పినవి నోట్ చేసుకుని ఇంటిదగ్గర చదువుకోవాలని ఇన్చార్జ్ హెచ్ఎం బల్లెడ. బాబురావు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ సర్వేశ్వరరావు, గ్రామ పెద్దలు బెందాళం. కృష్ణారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదల: దేశ ప్రగతికి అడ్డుగోడ -- అవగాహనతోనే పరిష్కారం

**నర్సీపట్నం పెన్ సత్తా జూలై 10::**ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పెరుగుతున్న జనాభా సమస్యలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వీఎస్ఎస్ఎస్ నెట్‌వర్క్ సెక్రటరీ జీటీవీఎస్ఆర్‌కే రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన నర్సీపట్నం జ్యోతి విలేఖరితో మాట్లాడుతూ, జనాభా పెరుగుదల అనేది భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.?పెరుగుతున్న జనాభా కారణంగా సహజ వనరులపై విపరీతమైన ఒత్తిడి

పెరుగుతోందని, దీనివల్ల పేదరికం, నిరుద్యోగం, ఆహార కొరత మరియు మౌలిక వసతుల లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులపై సరైన అవగాహన లేకపోవడం వల్ల జనాభా పెరుగుదల కొనసాగుతోందని చెప్పారు. దీనివల్ల ఆహారధాన్యాల డిమాండ్ పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయని, సాగు భూములు నివాస గృహాలుగా మారిపోతుండటంతో వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతోందని వివరించారు. నీరు, విద్యుత్ వంటి వనరులపై కూడా తీవ్ర ఒత్తిడి పడుతోందని, సంపద సమానంగా పంపిణీ కాకపోవడం వల్ల పేదరికం మరింత పెరుగుతోందని ఆయన వివరించారు.?ఈ సమస్యల నుంచి బయటపడటానికి యువతకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమని ఆయన

సూచించారు. మహిళలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి వివాహ వయసు పెరిగి, జననాల రేటు తగ్గుముఖం పడుతుందని చెప్పారు. అలాగే, దేశంలోని యువశక్తిని వనరుగా మార్చుకునేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి, స్వయం ఉపాధిని ప్రోత్సహించాలని జీటీవీఎస్ఆర్‌కే రాజు పిలుపునిచ్చారు. ఈ జనాభా దినోత్సవాన్ని దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం, వాటిని మత్తు కోసం వాడకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇకపై లైసెన్స్ తప్పనిసరి చేసింది. వీటికి కఠిన నియంత్రణలు వర్తిస్తాయని, ఈ ఔషధాలు విక్రయించాలంటే లైసెన్స్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇప్పటి వరకు లైసెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే తాజాగా ఈ మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఖ ప్రకారం, ఇప్పటి వరకు యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన 'టింక్చర్స్' లాంటి కొన్ని ఔషధ ఉత్పత్తులకు ఇంత వరకు లైసెన్స్ అవసరం లేకుండా మినహాయింపు ఉండేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే ఈ రకమైన కొన్ని ఔషధాల్లో ఇథైల్ ఆల్కహాల్ పరిమాణం చాలా ఎక్కువగా ఉంటోంది. కొన్నింటిలో అయితే ఏకంగా 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉంటోంది. అందువల్ల వీటిని మత్తు కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఎక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించింది.



ఈ సమస్యను పరిష్కరించడానికి 30 మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉండి, 12 శాతానికిపైగా పైగా ఇథైల్ ఆల్కహాల్ కలిగిన అన్ని రకాల ఔషధాలకు షెడ్యూల్-కె కింద ఇచ్చే మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఇటువంటి ఉత్పత్తులకు ఇకపై 'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940' కింద అవసరమైన లైసెన్సులను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, ఈ సవరణ ద్వారా ఈ ఔషధాలను డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఎ1 పరిధిలోకి మార్చారు. దీని ప్రకారం, రిజిస్టర్డ్ డాక్టర్ రాసిన మందుల చీటీ ఉంటేనే ఈ ఔషధాలను విక్రయించాల్సి ఉంటుంది. అలాగే ఆ విక్రయాలకు సంబంధించిన రికార్డులను చాలా కఠినంగా నిర్వహించాల్సి ఉంటుంది.

"ఈ సవరణ ద్వారా ఆల్కహాల్ ఉన్న ఔషధ ఉత్పత్తులపై నియంత్రణ ఏర్పడుతుంది. ఇవి కేవలం గుర్తింపు పొందిన ఫార్మాస్యూటికల్ సప్లై చైన్ ద్వారానే సరఫరా అవుతాయి. ఫలితంగా ఈ డ్రగ్స్ పక్కదారి పట్టే అవకాశం, దుర్వినియోగం అయ్యే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో నిజమైన వైద్య అవసరాల కోసం ఇవి నిరంతరం అందుబాటులో ఉంటాయి" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

ప్రస్తుతం ఉన్న డ్రగ్స్ నిబంధనల ప్రకారం, వివిధ సంప్రదాయ వైద్య విధానాల్లో ఇప్పటికే ఆల్కహాల్ పరిమితులు అమలులో ఉన్నాయి. రూల్ 161 ప్రకారం, ఆయుర్వేద, సిద్ధ, యునాని సిరప్?లలో గరిష్ఠంగా 16 శాతం ఆల్కహాల్? మాత్రమే అనుమతిస్తారు. అదే విధంగా రూల్? 106బీ ప్రకారం, హోమియోపతి మందుల్లో ఆల్కహాల్ పరిమాణ౦ 12 శాతానికి పరిమితం చేస్తారు. తాజా సవరణ ప్రకారం, కేవలం యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలు ఉన్నాయనే కారణంతో 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉన్న ఔషధాలకు ఇకపై షెడ్యూల్?-కె కింద మినహాయింపు ఇవ్వరు. నిజమైన వైద్య అవసరాల కోసం వీటిని నిరంతరం అందుబాటులో ఉంచుతూనే, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఔషధాల నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం, మందుల బాధ్యతాయుమైన, సరైన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన గెజిట్? నోటిఫికేషన్? ఆరోగ్య మంత్రిత్వశాఖ తన అధికారిక వెబ్?సైట్?లో అందుబాటులో ఉంటుంది.

# జాతీయ గీతం తప్పనిసరి!

జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ఆలపించేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వీటిని ఆలపించేటప్పుడు లేదా వాయిద్య ప్రదర్శన సమయంలో అధికారికంగా నిర్దేశించిన సాహిత్యాన్ని, స్పష్టమైన ఉచ్చారణను, పదాల స్పష్టతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. అధికారిక లిపిని, పద వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ శాఖలతో సహా అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాలకు జులై 9న హోం శాఖ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో జాతీయ గీతం, జాతీయ గేయాన్ని ఏ సందర్భాల్లో తప్పనిసరిగా ఆలపించాలి లేదా వినిపించాలి. ఏ సందర్భంలో అవసరాన్ని బట్టి వినిపించొచ్చు అనే దానికి సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని హోం శాఖ పునరుద్ఘాటించింది. హోం శాఖ ఆదేశాల ప్రకారం- జాతీయ గీతం, జాతీయ గేయాలను ఆలపించే లేదా ప్లే చేసే ప్రతి సందర్భంలోనూ అధికారికంగా ఆమోదించిన సాహిత్యాన్నే ఉపయోగించాలి. పదాల ఉచ్చారణ, స్పష్టతలో (డిక్షన్) ఎలాంటి పొరపాట్లు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక సాహిత్యం, ఉచ్చారణ మార్గదర్శకాలను హోం శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.




**వందేమాతరం ఎప్పుడు ఆలపించాలి?**

కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల ప్రకారం- పౌర పురస్కారాల ప్రదానోత్సవాలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో ఆయన వచ్చే సమయంలో, తిరిగి వెళ్లే సమయాల్లో వందేమాతరం ఆలపించాలి. రాష్ట్రపతి రేడియో (ఆకాశవాణి), టీవీల ద్వారా దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించే ముందు, ప్రసంగం ముగిసిన తర్వాత కూడా దీనిని వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు అధికారిక కార్యక్రమాలకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు, ఇంకా పరేడ్‌లో జాతీయ జెండాను తీసుకొచ్చే సందర్భాల్లో జాతీయ గేయం వందేమాతరం వినిపించాలని స్పష్టం చేసింది. వీటితో సహా ఇంకా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశించే ఇతర సందర్భాల్లోనూ జాతీయ గేయాన్ని వాడుకోవచ్చని పేర్కొంది.

**రాష్ట్ర గీతం ఉంటే పాటించాల్సిన క్రమం ఇదే**

కొన్ని రాష్ట్రాల్లో జాతీయ గీతం లేదా జాతీయ గేయంతో పాటు రాష్ట్ర గీతాన్ని కూడా ఆలపించే ఆనవాయితీ ఉందని హోం శాఖ పేర్కొంది. అలాంటి సందర్భాల్లో ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం, జాతీయ గీతానికి సముచిత గౌరవం కల్పించే విధంగా ఈ క్రమాన్ని పాటించాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 28న హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. అధికారిక కార్యక్రమాల్లో 3 నిమిషాల 10 సెకన్ల నిడివి గల ఆరు చరణాల అధికారిక రూపంలోని వందేమాతరం ఆలపించాలని పేర్కొంది. జాతీయ గేయం ఆలపించే సమయంలో సభలో ఉన్న ప్రతి ఒక్కరూ అటెన్షన్ పొజిషన్‌లో కచ్చితంగా నిల్చోవాలని స్పష్టం చేసింది.

**వందేమాతరం, జనగణమనకు సమాన హోదా, గౌరవం**

వందేమాతరం ఎప్పుడు పాడాలనే అంశంపై అన్ని సందర్భాలను ఒక జాబితా రూపంలో నిర్దేశించలేమని కేంద్రం పేర్కొంది. కానీ జాతీయ గేయానికి ఇవ్వాల్సిన సముచిత గౌరవాన్ని, క్రమశిక్షణను పాటిస్తూ- ప్రజలు ఎక్కడైనా, సామూహికంగా దీనిని ఆలపించవచ్చని, అందుకు ఎలాంటి ఆంక్షలు లేదా అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఈ మార్గదర్శకాల్ని మరోసారి గుర్తు చేసింది. 1950 జనవరి 24న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన తీర్మానం ప్రకారం రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'జనగణమన' ను భారత జాతీయ గీతంగా గుర్తించింది. అదే తీర్మానంలో భారత స్వాతంత్రోద్యమంలో చారిత్రక పాత్ర పోషించిన బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి కూడా జనగణమనతో సమాన గౌరవ హోదా కల్పించాలని నిర్ణయించింది.

# ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

ఇథనాల్ 20 పెట్రోల్ కారణంగా కొన్ని వాహనాల్లో మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కానీ దీని ప్రభావం కంటే ప్రయోజనాలే ఎక్కువ ఉన్నాయని వివరించింది. ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపింది. ఇది అధిక నాణ్యత, సమర్థవంతమైన ఇంధనం అని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా శాస్త్రీయ పరీక్షల తర్వాతే దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే కార్యక్రమంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు 'సందేహాలు- సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రక్రియను చాలా వేగంగా అమలు చేశారన్న ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. భారత్‌లో ఈ కార్యక్రమం 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని చెప్పింది. 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్పత్తిని ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపింది. ప్రత్యేక ఇథనాల్ ప్లాంట్లు, నిల్వ, లాజిస్టిక్స్‌లో పెట్టుబడుల తర్వాత భారత్ 2022లోనే నిర్దేశిత సమయానికి ముందే 10 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించిందని చెప్పింది. 2025-26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20




శాతం మిశ్రమాన్ని చేరుకుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**పాత వాహనాలు పాడవుతాయా?**

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపైనా కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. దేశవ్యాప్తంగా ఈ20ను పెట్రోల్?ను ప్రవేశపెట్టే ముందు ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, పికప్?, ఉద్గారాలపై విస్తృతమైన పరీక్షలు చేశామని చెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ20 వల్ల వాహనంలో తుప్పు, అసాధారణ అరుగుదల లేదా భాగాల జీవితకాలం దెబ్బతినడం వంటి సమస్యలను సర్వీస్ చేసిన వాహనాల్లో తాము ఎదుర్కోలేదని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్‌తో సహా ఆటోమొబైల్ తయారీదారుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించింది.

**వేర్వేరు పెట్రోల్‌లు సాధ్యం కాదు**

పెట్రోల్ పంపులు శుద్ధమైన పెట్రోల్, ఈ10, ఈ20 వంటి ఇంధన గ్రేడ్‌లను అందించాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. దేశవ్యాప్తంగా ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని వివరించింది. దీని వల్ల దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని పేర్కొంది.

**ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం**

ఇక ధరల విషయానికొస్తే, రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ ధరలు పెట్రోల్ ధరను మించవచ్చని అంచనా వేసింది. అందువల్ల సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని స్పష్టం చేసింది. ధరలను తగ్గించడం కంటే దిగుమతి చేసుకున్న ముడి చమురుపై భారత్? ఆధారపడటాన్ని తగ్గించడం, ధరల స్థిరత్వాన్ని మెరుగుపరచడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

**ఇప్పటి వరకు రూ.1.97 లక్షల కోట్లు ఆదా**

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల 2014-15 నుంచి రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలను విడుదల చేసింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని వివరించింది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎండలు మండిపోతున్న వేళ, చల్లదనం కోసం చూస్తున్న ప్రజలే లక్ష్యంగా ఓ భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. "నాసా మాజీ ఇంజనీర్లు రూపొందించారు", "కేవలం 90 సెకన్లలో గదిని చల్లబరుస్తుంది" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోర్టబుల్ ఎయిర్ కండీషనర్ల (ఏసీ) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఇదంతా ఓ పెద్ద స్కామ్ అని తేలింది. ఈ వ్యవహారంపై బీబీసీ ప్రచురించిన కథనం ప్రకారం, ఈ పరికరాలు ఏసీలు కావని, కేవలం సాధారణ ఫ్యాన్లు మాత్రమేనని స్పష్టమైంది. ఈ మోసపూరిత ప్రకటనల్లో, చిన్నగా ఉండే ఈ పరికరాలను శక్తివంతమైన ఏసీలుగా చిత్రీకరిస్తున్నారు. సుమారు 70 నుంచి 120 పౌండ్లు (దాదాపు రూ. 7,000 నుంచి రూ. 12,000) ధర పలికే ఈ పరికరాలకు నాసా టెక్నాలజీని జోడించి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకమైన కూలింగ్ క్యాట్రిడ్జ్‌లు, తక్కువ విద్యుత్ వినియోగం వంటి ఫీచర్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. వీటిని అత్యాధునికంగా చూపించేందుకు, రాగి తీగలు, మెటల్ బాక్సులతో ఉన్నట్టుగా కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన ఫోటోలను వాడుతున్నారు. వాస్తవానికి, ఇవి ఏసీలు కానే కావు. వీటిని "స్వాంప్ కూలర్లు" అని పిలిచే సాధారణ ఎవాపరేటివ్ కూలర్లుగా నిపుణులు తేల్చారు. అంటే, ఒక ఫ్యాన్‌కు తడి అట్ట లేదా స్పాంజ్ లాంటిదాన్ని అమర్చి, దాని ద్వారా గాలిని బయటకు పంపే పరికరాలు. అసలైన ఏసీలలో గదిలోని వేడిని బయటకు పంపేందుకు కంప్రెసర్, ఎగ్జాస్ట్ పైపు ఉంటాయి. కానీ, ఈ నకిలీ పరికరాల్లో అలాంటి వ్యవస్థ ఉండదు. పైగా, ఇవి గదిలోని తేమను మరింత పెంచుతాయి. యూకే వంటి తేమతో కూడిన వాతావరణంలో ఇవి గదిని చల్లబరచకపోగా, మరింత ఉక్కపోతను సృష్టిస్తాయి. "ప్రాపర్ డీఐవై" యూట్యూబర్ స్టువర్ట్ మాథ్యూస్ వీటిని పరీక్షించి, ఇవి "చౌకబారు విడిభాగాలతో, తప్పుడు శాస్త్రీయ సూత్రం ఆధారంగా పనిచేసే పనికిరాని వస్తువులు" అని తేల్చిచెప్పారు. యూకేకు చెందిన అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఏఎస్ఏ) కూడా ఈ ప్రకటనలపై వినియోగదారులను హెచ్చరించింది. "నమ్మశక్యం కాని హామీలు, రహస్య ఆవిష్కరణల కథలు, నకిలీ రివ్యూలు" వంటివి కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి ప్రకటనలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేరుగా జరిమానాలు విధించే అధికారం తమకు లేదని ఏఎస్ఏ తెలిపింది. ఏదైనా పరికరం కొనే ముందు, దానిపై స్వతంత్ర రివ్యూలను పరిశీలించడం చాలా ముఖ్యమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

కరూర్ తొక్కిసలాట ఘటనను అడ్డుపెట్టుకుని అప్పటి అధికార పార్టీ ఐవీఖ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని తమిళనాడు సీఎం విజయ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కరూర్‌లో పర్యటించకుండా అప్పటి ఐవీఖ ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. కరూర్ తొక్కిసలాటలో బాధితుల కుటుంబసభ్యలకు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. 32 కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను సీఎం ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి కరూర్‌లో పర్యటిస్తున్నారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. తొక్కిసలాట ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐవీఖతో పాటు కరూర్ పోలీసులపై విజయ్ విమర్శలు గుప్పించారు. ర్యాలీకి జనం పోటెత్తుతున్నప్పుడు సభను రద్దు చేసే పూర్తి అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ, వారు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని విజయ్ మండిపడ్డారు. తాను పోలీసులను పూర్తిగా నమ్మానని, కానీ ఇదంతా ఎవరి ఆదేశాలతో జరిగిన నాటకమో చెప్పాలని ఆయన నిలదీశారు. నల్ల దుస్తులు ధరించి సభకు హాజరైన సీఎం విజయ్ తొక్కిసలాటలో మరణించిన చిన్న పిల్లలు, ఇతర బాధితుల జ్ఞాపకార్థం తమ పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కరూర్ తొక్కిసలాట బాధ తన జీవితంలో ఏ విజయమూ చెరపలేదని విజయ్ పేర్కొన్నారు. ఎంతోమంది అమాయక పిల్లలు ఈ ప్రమాదంలో చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు.

"ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించినా సరే తన జీవితంలో ఎక్కడో ఓ చోట బాధాకరమైన క్షణాలను ఎదుర్కోక తప్పదు. నా రాజకీయ ప్రయాణంలో కరూర్ ఘటన అలాంటిదే. ఆ తొక్కిసలాటలో ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారు. దీనికి బాధ్యులెవరు? ఆ రోజు ర్యాలీకి రద్దీ ఎక్కువగా ఉందని పోలీసులకు అనిపించినప్పుడు మమ్మల్ని అలర్ట్ చేయాల్సింది. లేదా సమావేశాన్ని రద్దు చేయాల్సింది. వారికి అన్ని హక్కులూ ఉన్నాయి కదా! కానీ, అవేవీ చేయకుండా వారు డ్రామా చూశారు. బహుశా అలా చేయమని వారిపై ఎవరి (నాటి డీఎంకే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ఒత్తిడైనా ఉండి ఉంటుంది. రద్దీని నియంత్రించగలరని నేను పోలీసులను నమ్మాను. కానీ, నా వల్లే మరణాలు జరిగాయని నాడు నాపై నిందలేశారు. ఘటన తర్వాత నేను పారిపోయానని ప్రత్యర్థులు నాపై బురదజల్లారు. కానీ, నేను పారిపోలేదు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా"

**సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం**

ఇదిలా ఉండగా, సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న మద్దతుదారుల మధ్య ఒక వ్యక్తి బారికేడ్లను దాటుకుని ముఖ్యమంత్రి కాన్వాయ్ వైపు దూసుకెళ్లాడు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, ఆ వ్యక్తి ముఖ్యమంత్రి వాహనాన్ని చేరుకోకముందే అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కాన్వాయ్ ఎటువంటి అంతరాయం లేకుండా తన గమ్యస్థానానికి చేరుకుంది. అటు విజయ్ పర్యటన నేపథ్యంలో కరూర్‌లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ అంతటా భారీగా పోలీసు బలగాల మోహరింపు, ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సభకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా౹= కోడ్ ఆధారిత ప్రవేశ పాస్‌లు జారీ చేశారు. మరోవైపు ఈ పర్యటనపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. సీఎం కరూర్ పర్యటన కేవలం రాజకీయ ప్రేరేపితమని, ఇది ఈ కేసుపై జరుగుతున్న జదీ× విచారణను ప్రభావితం చేస్తుందని ఆరోపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన జరిగింది. గతేడాది సెప్టెంబర్ 27న ఎఖ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు తాజాగా అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

2030లో కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ఈ ప్రపంచ స్థాయి ఈవెంట్‌లను నిర్వహించడానికి క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ జరగనుండటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఏ క్రీడా లీగ్‌కైనా, భారతదేశంలో ఒక ఈవెంట్‌ను నిర్వహించడం విస్తృతమైన గుర్తింపు లభిస్తాయని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ, మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించారు. అనంతరం ఆయన ఈ మేరకు మాట్లాడారు.

**యువ క్రికెటర్లతో ముచ్చటించిన మోదీ**

చరిత్రాత్మక క్రీడా వేదికను సందర్శించిన సందర్భంగా ప్రధాని మోదీ, యువ క్రికెటర్ల జెర్సీలపై సంతకాలు చేశారు. అనంతరం, క్రీడా ప్రతిభావంతులతో ముచ్చటించారు. ఆస్ట్రేలియా అధికారిక చిహ్నమైన "రూబీ ది రూ"తో ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ శోభను మరింత పెంచుతూ, ఆస్ట్రేలియా పురుషుల క్రికెట్ జట్టు దిగ్గజ మాజీ కెప్టెన్ స్టీవ్ వా స్టేడియంలో మోదీని కలిశారు. "వీజ+లోకి అడుగుపెట్టగానే ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలు కలుగుతాయి. మొదటిది, భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం. రెండోది, మన రెండు దేశాల్లో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే వాస్తవం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక, స్టేడియం పర్యటనకు ముందు ఆస్ట్రేలియా ప్రతిపక్ష నేత అంగస్ టేలర్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలల విస్తృత చర్చలు జరిపారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు బలపడుతున్న తీరు, భవిష్యత్తు అవకాశాలపై తామిద్దరం ఆసక్తికరమైన చర్చలు జరిపినట్లు మోదీ తెలిపారు.


## సంపాదకీయం

# వ్యూహాత్మక వారధి!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వారం జరిపిన ఆస్ట్రేలియా పర్యటన సారాంశంలోనూ, ఆడంబరంలోనూ రెండింటా ఘనంగానే సాగింది. ఇరు దేశాల నాయకుల మధ్య ఆత్మీయ సంభాషణలు, ప్రవాస భారతీయులతో భారీ బహిరంగ సభ, ఒప్పందాలతో, భవిష్యత్ ప్రణాళికలతో నిండిన సంయుక్త ప్రకటన.. ఈ దృశ్యమాలిక ఇప్పుడు భారత్-ఆస్ట్రేలియా సంబంధాల్లో సుపరిచితమైన సంప్రదాయంగా మారిపోయింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం తన ఆర్థిక వైవిధ్యీకరణ వ్యూహంలో భారత్‌ను కేంద్రబిందువుగా చూస్తోంది. ఆ దేశం ప్రకటించిన కొత్త ఆర్థిక ప్రణాళిక, భారత్ కోసం రూపొందించిన మంత్రుల పర్యటనల క్యాలెండర్ ఇందుకు బలమైన సాక్ష్యాలు. అక్కడి రాజకీయ వర్గాల్లో భారత్‌పట్ల ఏర్పడిన ఏకాభిప్రాయం పార్టీలకు అతీతం. అయితే ఇక్కడే ఒక సూక్ష్మమైన, కీలకమైన ప్రశ్న తలెత్తుతుంది. అభిప్రాయ సామీప్యం (కన్వర్జెన్స్) వేరు, వ్యూహాత్మక ఏకీకరణ (అలైన్‌మెంట్) వేరు. రెండూ పర్యాయపదాలుగా వినిపించినా, వాటి మధ్య తేడా లోతైనది. రెండు దేశాలు తమ తమ కారణాలతో ప్రపంచం గురించి ఒకే విధమైన నిర్ధారణలకు రావడం సామీప్యం. ఆ నిర్ధారణలను పరస్పరం అనుసంధానమయ్యే సైనిక సామర్థ్యాలుగా, సంస్థాగత వ్యవస్థలుగా, నిరంతర సహకార అలవాట్లుగా మలచుకోవడం ఏకీకరణ. భారత్-ఆస్ట్రేలియా మొదటిదాన్ని పుష్కలంగా సాధించాయి. ఈ పర్యటనలో నిజమైన పరీక్ష.. భవిష్యత్‌లో రెండోదాన్ని అందించగలదా అన్నదే. సామీప్యం ఎందుకు ఇంతగా బలపడిందో అర్థం చేసుకోవడం కష్టం కాదు. మారుతున్న ప్రపంచ క్రమంలో ఏ ఒక్క దేశంపైనో అతిగా ఆధారపడటం ప్రమాదకరమని ఇరు దేశాలూ గుర్తించాయి. చైనాపై ఆస్ట్రేలియా ఆర్థికంగా ఆధారపడటం, అనూహ్యంగా వ్యవహరిస్తున్న వాషింగ్టన్‌పై దాని రక్షణకు ఆధారపడటం -రెండూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఈ ఏడాది లోవీ ఇన్‌స్టిట్యూట్ సర్వేలో అమెరికాపై ఆస్ట్రేలియన్ల విశ్వాసం రికార్డు కనిష్ఠమైన 31 శాతానికి పడిపోయింది. ట్రంప్ హయాంలో వాషింగ్టన్‌కు దూరం జరగాలనుకునేవారు స్వల్ప ఆధిక్యంలో ఉన్నారన్నది సర్వే సారాంశం. భారత్ కూడా ఇదే స్వభావంతో ఇంధన సరఫరాదారుల్లో, రక్షణ వేదికల్లో, కీలక ఖనిజాల శుద్ధిలో తనదైన వైవిధ్యీకరణను సమాంతరంగా కొనసాగిస్తోంది. ఎంత దీర్ఘకాలికమైనదైనా, ఏ ఒక్క వనరుపైనైనా పూర్తిగా ఆధారపడటం నేటి ప్రపంచంలో బలహీనతేనన్నది ఇరాన్, ఉక్రెయిన్ సంఘర్షణలు నేర్పిన పాఠం. ఈ పర్యటన ఆ దిశగా కొన్ని స్పష్టమైన, స్పృశించదగిన ఫలితాలను అందించిందనడంలో సందేహం లేదు. ఉమ్మడి ముప్పు అంచనాలను ఎదుర్కొనేందుకు భారత్-ఆస్ట్రేలియా సముద్ర భద్రతా సహకార ప్రణాళికను ఇరుపక్షాలు ఆమోదించాయి. ఇంధన భద్రత విషయంలో మరో కీలక ముందడుగు పడింది. 2014నాటి ద్వైపాక్షిక పౌర అణు ఒప్పందం ద్వారా ఆస్ట్రేలియా యురేనియం భారత్‌కు చట్టబద్ధంగా అందుబాటులో ఉన్నా, వాణిజ్యపరంగా ఒక్క గ్రాము కూడా కదల్లేదు. దశాబ్దకాలంగా నిద్రాణంగా ఉన్న ఒప్పందం ఇప్పుడు యురేనియం సరఫరా అంగీకారంతో కార్యరూపం దాల్చింది. సైబర్, కీలక సాంకేతికతలు, సరఫరా గొలుసులపై భాగస్వామ్యం (పాక్ట్స్) కూడా ఈ శిఖరాగ్ర భేటీలో ప్రారంభమైంది. ఆస్ట్రేలియా-కెనడా-భారత్ సాంకేతిక, ఆవిష్కరణల భాగస్వామ్యానికి ఇది అనుబంధంగా నిలుస్తుందని, సరళమైన చిన్న కూటముల ద్వారా ధృడమైన సాంకేతిక భాగస్వామ్యాలను నిర్మించడమే లక్ష్యమని ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయి. ఏకీకరణ సంస్థాగత రూపం సంతరించుకోవడానికి ఇవి ఉదాహరణలు. అయితే ఏకీకరణ చిరకాలం నిలవాలంటే, అభిప్రాయ సామీప్యం కార్యాచరణ సమన్వయంగా పరిణమించాలి. ఇది అత్యంత కీలకమయ్యే రంగం హిందూ మహాసముద్రం -- ఇరు దేశాల ప్రయోజనాలు అత్యంత సహజంగా కలిసే ప్రాంతం ఇదే. రెండూ హిందూ మహాసముద్ర దేశాలే; ఈ ప్రాంత నౌకా మార్గాల్లో రెండింటికీ వాస్తవ ప్రయోజనాలున్నాయి. సముద్ర రంగ అవగాహనకు భారత్ నెలకొల్పిన సమాచార సమన్వయ కేంద్రం (ఐఎఫ్‌సీ--ఐఓఆర్) కీలక వేదికగా ఎదిగింది. ఆస్ట్రేలియా కూడా తన పశ్చిమ తీరంపై, హిందూ మహాసముద్ర మార్గాలపై దృష్టి పెంచుతోంది. నీడ నౌకాదళాలు, సముద్రగర్భ కేబుళ్లకు ముప్పులు, యుద్ధస్థాయికి చేరని బలప్రయోగ చర్యలు -- వీటిపై ఇరు నౌకాదళాల ముప్పు అంచనాలు దాదాపు ఒకేలా ఉన్నాయి. కొత్త తీరగస్తీ ఒప్పందం, సముద్ర భద్రతా ప్రణాళిక వ్యూహాత్మక సంకల్పానికీ, కార్యాచరణ సహకారానికీ మధ్య అంతరాన్ని తగ్గిస్తాయి. అయినా వాస్తవం మరవరాదు. ఆకస్ కూటమి మొదలుకొని ఆస్ట్రేలియా అత్యంత కీలక సైనిక నిర్మాణ నిర్ణయాలన్నీ పశ్చిమ పసిఫిక్ వైపే మొగ్గుతున్నాయి. భారత వ్యూహకర్తలేమో భూసరిహద్దు ముప్పులకూ, సముద్ర సవాళ్లకూ మధ్య దృష్టిని పంచుకోవాల్సిన స్థితిలోనే ఉన్నారు. ఉమ్మడి క్షేత్రం వాస్తవమే గానీ, రాజకీయ సామీప్యం సూచించే దానికంటే అది సంకుచితమే. ఆర్థిక రంగంలోనూ ఇదే తీరు కనిపిస్తుంది. ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చాక వాణిజ్యం గణనీయంగా పెరిగినా, ఆ వృద్ధి ఫలాలు అసమానంగా పెద్ద సంస్థల వద్దే పోగుపడుతున్నాయని పరిశ్రమ వర్గాలు అంతర్గత సమావేశాల్లో వాపోతున్నాయి. ఇరువైపులా చిన్న ఎగుమతిదారులకు ఆ ఒప్పందాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలియని స్థితి. దీన్ని 'అమలు లోపం'గా ట్రాక్ 1.5 చర్చావేదికలు ఇప్పటికే ఎత్తిచూపాయి. ఆస్ట్రేలియా ప్రజల్లో భారత్ గురించిన అవగాహన లోటు మరింత స్పష్టం. దశాబ్దం తర్వాత ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన శక్తిగా భారత్ ఉంటుందని కేవలం 5 శాతం ఆస్ట్రేలియన్లే భావిస్తుండగా, చైనా విషయంలో ఆ సంఖ్య 54 శాతం. భారత్‌పై విశ్వాసం మాత్రం తులనాత్మకంగా అధికమే. అంటే.. పైస్థాయి సామీప్యం ఇంకా సామాన్య ప్రజల చైతన్యంలోకి దిగిరాలేదన్నమాట.

ఈ లోటును పూడ్చగల అతిపెద్ద అవకాశం ప్రవాస భారతీయులే. ఈ సంభాషణలకు మోదీ పర్యటన కొత్త ఊతమిచ్చింది. ఆస్ట్రేలియా పింఛను నిధులు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలన్న ఆయన పిలుపు సభలో ప్రత్యేకంగా ప్రతిధ్వనించింది. వాటిని కేవలం మూలధనంగా కాక, ఆస్ట్రేలియా కుటుంబాలు భారత్‌పై ఉంచిన వ్యూహాత్మక విశ్వాసానికి చిహ్నంగా భారత్ పరిగణిస్తుందని ప్రకటించారు. ఇలాంటి మాటలు ప్రాధాన్యం సంతరించుకోవడానికి కారణం -భవిష్యత్తుకు నమ్మదగిన భాగస్వామిగా భారత్ అనే భావనను అవి విస్తృత ప్రజా చైతన్యంలో నాటుతాయి. మొత్తానికి తేలేదేమిటంటే -అభిప్రాయ సామీప్యం ఇరు దేశాలను చర్చల బల్ల వద్దకు చేర్చింది. కానీ నిలిచేది మాత్రం అంచెలంచెలుగా సహకారాన్ని సంస్థాగతం చేసే ఈ చిన్న చిన్న అడుగులే!

## పనికొచ్చే పలుకు



# కష్టాలే.. వ్యక్తిత్వాన్ని మలుస్తాయి

"ప్రశాంతమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో వ్యక్తిత్వం రూపుదిద్దుకోదు. కష్టాలు, సవాళ్లను ఎదుర్కోవడం ద్వారానే ఆత్మబలం పెరుగుతుంది, లక్ష్యంపట్ల స్పష్టత వస్తుంది, ఆశయాలు బలపడతాయి, విజయం సిద్ధిస్తుంది" అని ప్రముఖ సామాజిక కార్యకర్త, రచయిత్రి హెలెన్ కెల్లర్ పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే నిజమైన విజయమని ఆమె మాటలు గుర్తుచేస్తున్నాయి.

ఆటంకాలే విజయానికి రహదారులు

కష్టాలనేవి విజయానికి అడ్డంకులు కావని, అవి మన ఆత్మను బలోపేతం చేసే అనుభవాలని హెలెన్ కెల్లర్ సూక్తి వివరిస్తుంది. అపజయాలు మనకు జీవితంలో గొప్ప పాఠాలను నేర్పుతాయి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు మన నిర్ణయాలను పునఃసమీక్షించుకోవడానికి, మనలోని దాగివున్న అసలు శక్తులను గుర్తించడానికి ఇవి దోహదపడతాయి. అడ్డంకులు లేకపోతే మనిషి జీవితంలో ఎదుగుదల, మార్పు సాధ్యం కాదని ఆమె గట్టిగా నమ్మారు. తక్షణ విజయాలను ఆశించే ప్రస్తుత రోజుల్లో హెలెన్ కెల్లర్ మాటలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం. అనిశ్చిత పరిస్థితులు ఎదురైనప్పుడు సహనం, చిత్తశుద్ధి, నిరంతర కృషి ఎంత అవసరమో ఆమె సందేశం స్పష్టం చేస్తోంది. ఓటమి ఎదురైన ప్రతిసారీ తిరిగి పుంజుకుని, మన శక్తినంతా సరైన లక్ష్యంవైపు కేంద్రీకరించడమే నిజమైన వ్యక్తిత్వ లక్షణం. హెలెన్ కెల్లర్ సొంత జీవితమే ఇందుకు ఒక నిలువెత్తు నిదర్శనం. చిన్నతనంలోనే చూపు, వినికిడి శక్తిని కోల్పోయినా, ఆమె తన పరిస్థితులకు లొంగిపోకుండా ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచారు.

హెలెన్ కెల్లర్ మరికొన్ని అద్భుత సూక్తులు

"ప్రపంచంలో అత్యంత అందమైన విషయాలను కళ్లతో చూడలేం, చేతులతో తాకలేం. వాటిని గుండెతో మాత్రమే అనుభవించగలం."

"కళ్లుండి కూడా భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యం లేకపోవడం కంటే ఘోరమైన గుడ్డితనం మరొకటి లేదు."

"ఒంటరిగా మనం కొద్దిగైనా సాధించగలం. కానీ కలిసికట్టుగా ఉంటే అద్భుతాలు సృష్టించగలం."

"మూసుకుపోయిన తలుపువైపే మనం ఎక్కువసేపు చూడటం వల్ల, మన కోసం తెరిచిన మరో తలుపును గమనించలేకపోతున్నాం."

"ఆశావాదం అనేది విజయానికి నడిపించే నమ్మకం. ఆశ, ఆత్మవిశ్వాసం లేకుండా ఏదీ సాధించలేం."


"ఆశ అనేది అదృశ్యమైనదాన్ని చూస్తుంది. స్పర్శకు అందనిదాన్ని అనుభవిస్తుంది. అసాధ్యమైనదాన్ని సుసాధ్యం చేస్తుంది."

"జీవితంలో పోరాటమే మనకు లభించే అతిపెద్ద ఆశీర్వాదం. ఇది మనల్ని సహనశీలురుగా, సున్నితమనస్కులుగా మారుస్తుంది."

"నాకున్న ఐదు జ్ఞానేంద్రియాలలో ఒకదాన్ని మాత్రమే ఎంచుకునే అవకాశం వస్తే నేను వినికిడి శక్తిని ఎంచుకుంటాను. అప్పుడు నేను ఒంటరిగా ఉన్న భావన కలగదు."

"మీ కంఫర్ట్ జోన్‌కు, మీ కలలకు మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలోనే అసలైన జీవితం దాగి ఉంటుంది."


# ఏఐ మలుపునకు మేల్కొలుపు!




నిటారుగా నిలబెట్టిన పెన్నును వదిలేస్తే అది కిందపడుతుందని ఐదేళ్ల పిల్లాడు సైతం చెప్తాడు. కానీ లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులతో, ప్రపంచాన్నే ఊపేస్తున్న కృత్రిమ మేధ నమూనాలు మాత్రం -ఆ చిన్న భౌతిక సత్యాన్ని 'అర్థం' చేసుకోలేవు. అవి చెప్పగలిగేది తమ వద్దనున్న డేటా ఆధారంగా ఒక ఊహను మాత్రమే. ఇదీ నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచపు అతిపెద్ద వైచిత్రి! చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినీ వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్‌ఎల్‌ఎంలు) కవితలు రాస్తాయి. కోడింగ్ చేస్తాయి. గణిత సమస్యలు విడగొడతాయి. పరీక్షల్లో మనుషులను మించి మార్కులు తెచ్చుకుంటాయి. కానీ 'భౌతిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో ఒక ఎలుకకున్న సామర్థ్యమున్న రోబోట్ కూడా మన దగ్గర లేదు' అని ఏఐ రంగపు మేటి శాస్త్రవేత్తల్లో ఒకరైన యాన్ లెకన్ కుండబద్దలు కొట్టారు. డీప్ లెర్నింగ్ పితామహుల్లో ఒకరిగా, ట్యూరింగ్ అవార్డు గ్రహీతగా పేరున్న లెకన్ మాటలను తేలిగ్గా కొట్టిపారేయలేం. మెటా కంపెనీలో దశాబ్దానికి పైగా చీఫ్ ఏఐ సైంటిస్ట్‌గా పనిచేసి, 2025లో ఆ సంస్థను వీడి పారిస్ కేంద్రంగా 'అడ్వాన్స్‌డ్ మెషీన్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్' (ఏఎంఐ ల్యాబ్స్)ను స్థాపించిన ఆయన.. ప్రస్తుత జనరేటివ్ ఏఐ సంబరాలపైనే తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఎల్‌ఎల్‌ఎంలు మాటల్లో మేటి కావచ్చుగానీ, వాటికి మనుషుల స్థాయి తెలివితేటలు లేవు; కనీసం జంతువులస్థాయి మేధస్సు కూడా లేదన్నది ఆయన నిర్ధారణ. ఎందుకంటే అవి వాస్తవ ప్రపంచపు డేటాతో వ్యవహరించలేవు; అసలు వాటిని ఆ పని కోసం నిర్మించనే లేదు. మనిషి పలికే ప్రతి వాక్యం వెనుక ఒక జీవితకాలపు అనుభవం, స్పర్శ, చూపు, తప్పటడుగులు, పడిలేచిన పాఠాలుంటాయి. యంత్రం పలికే వాక్యం వెనుక ఉన్నది కేవలం గణాంక అంచనాలే. 'తర్వాత ఏ పదం వస్తుంది' అనే లెక్క తప్ప, 'ఆ పదానికి అర్థమేమిటి, ఆ చర్యకు పర్యవసానమేమిటి' అనే ఇంగితం లేదు. ఇస్త్రీ చేయడం, డిష్‌వాషర్‌లో గిన్నెలు సర్దడంవంటి 'సామాన్య' ఇంటిపనులే నేటి అత్యాధునిక రోబోట్లకు అందని ద్రాక్షలుగా మిగిలిపోవడానికి కారణమిదే. యంత్రాలకు క్లిష్టమైనవి మనకు సులువు, మనకు సులువైనవి యంత్రాలకు క్లిష్టం అనే ఈ వైరుధ్యాన్ని శాస్త్ర ప్రపంచం 'మొరావెక్ పారడాక్స్' అంటుంది. దాన్ని ఛేదించకుండా 'మానవాతీత మేధస్సు' గురించి మాట్లాడటం అర్థరహితమన్నది లెకన్ వాదన. కేవలం ఎల్‌ఎల్‌ఎంలను పెంచుకుంటూ పోవడం ద్వారా మానవస్థాయి మేధను ఎన్నటికీ అందుకోలేమన్న ఆయన హెచ్చరిక, ప్రస్తుత ఏఐ పరుగుపందెంపై ఆలోచించదగిన విరామ చిహ్నం!

మరి ప్రత్యామ్నాయమేమిటి? దానికి లెకన్ చెబుతున్న సమాధానం 'వరల్డ్ మోడల్స్'. మాటలనుంచి కాక, వాస్తవ ప్రపంచం నుంచి నేర్చుకునే కృత్రిమ మేధ. కళ్లు, సెన్సర్ల ద్వారా అందే సమాచారంతో ప్రపంచం ఎలా పనిచేస్తుందో, ఏ చర్యకు ఏ ఫలితం వస్తుందో అంతర్గతంగా ఊహించుకోగల నమూనాలను నిర్మించడం దీని లక్ష్యం. లెకన్ 2022లోనే ప్రతిపాదించిన 'జాయింట్ ఎంబెడింగ్ ప్రిడిక్టివ్ ఆర్కిటెక్చర్' (జేపా) అనే చట్రం దీనికి పునాది. పైన చెప్పుకున్న పెన్ను ఉదాహరణనే తీసుకుంటే -పెన్ను ఏ దిశలో పడుతుందో కచ్చితంగా అంచనా వేయడం అసాధ్యమని, అసలు ఆ ప్రయత్నమే నిష్ప్రయోజనమని గుర్తించగలగడం నిజమైన తెలివి. పనికిరాని వివరాలను వడపోసి, పనికొచ్చే సారాన్ని మాత్రమే గ్రహించే ఈ విచక్షణే వరల్డ్ మోడల్స్ ప్రత్యేకత. ఈ ఆలోచనకు మార్కెట్ కూడా భారీగానే స్పందించింది. ఏఎంఐ ల్యాబ్స్ 1.03 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,560 కోట్లు) సీడ్ నిధులను 3.5 బిలియన్ డాలర్ల విలువ అంచనాతో సమీకరించింది. యూరప్ చరిత్రలో ఒక అంకుర సంస్థకు లభించిన అతిపెద్ద తొలిదశ పెట్టుబడి ఇదే. చిప్ దిగ్గజం ఎన్విడియా, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ వంటి హేమాహేమీలు ఇందులో భాగస్వాములు. ఉత్పాదక పరిశ్రమలు, ఏరోస్పేస్, బయోమెడికల్, ఫార్మావంటి సంక్లిష్ట భౌతిక వ్యవస్థలను నడిపే సంస్థలే ఈ కొత్త మేధకు తొలి వినియోగదారులవుతాయని అంచనా. నిజానికి వరల్డ్ మోడల్స్ భావన కొత్తదేమీ కాదు. 2018లో డేవిడ్ హా, యుర్గెన్ ష్మిడ్‌హూబర్ ప్రచురించిన పరిశోధనా పత్రం ఈ దిశగా తొలి దీపం వెలిగించింది. గూగుల్ 'డ్రీమర్', డీప్‌మైండ్ 'జీనీ', లండన్ సంస్థ వేవ్ రూపొందించిన 'గైయా', ఏఐ దిగ్గజం ఫీ-ఫీ లీ శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థాపించిన 'వరల్డ్ ల్యాబ్స్' -ఇలా ఈ బాటలో పయనిస్తున్న వారి జాబితా పెరుగుతూనే ఉంది. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఇంగ్మార్ పోస్నర్ తన బృందంతో కలిసి నాలుగేళ్లుగా 'మెకానిస్టిక్ వరల్డ్ మోడల్'పై కృషి చేస్తున్నారు. రాబోయే దశాబ్దంలో ఏఐ వ్యవస్థలు మనం అడిగింది చేసి ఊరుకోవు; 'ఏది ముఖ్యం, దేనివల్ల ఏం జరుగుతుంది' వంటి ప్రశ్నలకు వివరణలు ఇవ్వగలుగుతాయి. అవసరమైనప్పుడు జ్ఞానాన్ని గుర్తుకు తెచ్చుకుని, కలిపి, సవరించుకోగలిగేలా దాన్ని వ్యవస్థీకరించే నిర్మాణాలే భవిష్యత్ మేధకు పునాదులవుతాయని పోస్నర్ చెబుతున్నారు. ఈ ఏడాది తమ నమూనాను మెరుగుపరిచి, వచ్చే ఏడాదికి పారిశ్రామిక రంగంలోకి తీసుకువస్తామని లెకన్ ధీమాగా ఉన్నారు.

ఈ మొత్తం చర్చనుంచి సమాజం నేర్వాల్సిన పాఠాలు కొన్ని ఉన్నాయి. మొదటిది -సాంకేతిక ప్రచారానికీ వాస్తవానికీ మధ్య ఉన్న అగాధాన్ని గుర్తించడం. చాట్‌బాట్ ధారాళంగా మాట్లాడగానే అదే సర్వజ్ఞమని భ్రమపడటం ప్రమాదకరం. వైద్యం, న్యాయం, విద్యవంటి కీలక రంగాల్లో ఎల్‌ఎల్‌ఎంల 'ఊహాజనిత' సమాధానాలు (హాలూసినేషన్స్) ప్రాణాంతకం కాగలవన్న స్పృహతోనే వాటిని వాడుకోవాలి. రెండోది -పరిశోధనా వైవిధ్యం విలువ. ప్రపంచమంతా ఒకే దారిలో పరుగెడుతున్నప్పుడు, భిన్నంగా ఆలోచించే ధైర్యం చేసినవారే కొత్త ద్వారాలు తెరుస్తారు. అందరూ ఎల్‌ఎల్‌ఎంల వెంట పడుతున్న వేళ, వాటి పరిమితులను ప్రశ్నించి ప్రత్యామ్నాయ మార్గంవైపు బిలియన్ డాలర్ల సాహసం చేస్తున్న లెకన్ తీరు శాస్త్రీయ వైఖరికి నిదర్శనం. ఆయన బాట విజయవంతం అవుతుందో లేదో కాలమే చెప్పాలిగానీ, గుడ్లన్నీ ఒకే బుట్టలో పెట్టకూడదన్న వివేకం మాత్రం ఏ రంగానికైనా వర్తిస్తుంది. మూడోది -భారత్‌వంటి దేశాలకు ఇందులో దాగిన అవకాశం. ఎల్‌ఎల్‌ఎంల పోటీలో అమెరికా, చైనాలతో తలపడటం కంటే, ఇంకా శైశవ దశలోనే ఉన్న వరల్డ్ మోడల్స్, రోబోటిక్స్, భౌతిక మేధ వంటి రేపటి రంగాల్లో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం తెలివైన ఎత్తుగడ కావొచ్చు. యూరప్ ఒక అంకుర సంస్థపై రూ.9,500 కోట్లకు పైగా పందెం కాయగలిగినప్పుడు, ప్రతిభకు కొదవలేని మన దేశం మౌలిక పరిశోధనపై ఎందుకు వెనుకాడాలి? చివరగా, అన్నింటికంటే ముఖ్యమైనది.. రోబోలు స్వతంత్రంగా పనిచేసే రోజు వస్తే మనుషుల గతేమిటన్న భయాందోళనలకు లెకన్ ఇచ్చిన జవాబు ఆలోచనాత్మకం. -'ఏ ప్రశ్నలు అడగాలో, ఏం నిర్మించాలో, ఏం సృష్టించాలో తెలుసుకోవడానికి మనుషుల మేధ ఎప్పటికీ అవసరమే. ఏఐ కేవలం మన కోసం పనిచేస్తుంది, అంతే'. యంత్రం ఎంత ఎదిగినా అది సాధనమే తప్ప సారథి కాదు. ప్రశ్నించే తత్వం, సృజించే శక్తి, విలువలను నిర్ణయించే వివేకం -ఇవి మనిషి సొత్తు. ఎలుక మెదడును సైతం అందుకోలేని యంత్రాల ముందు ఆత్మన్యూనతతో తలవంచాల్సిన అవసరం మానవాళికి లేదు. కాకపోతే, ఆ యంత్రాలను ఏ దిశగా నడిపించాలో నిర్ణయించే బాధ్యత మాత్రం మనదే. పెన్ను ఎటు పడుతుందో యంత్రానికి తెలియకపోవచ్చు; కానీ ఆ పెన్నుతో భవిష్యత్తును ఎలా రాయాలో తెలిసింది మాత్రం మనిషికే! ■



మీరు కలలుగన్న జీవితాన్ని "రేపు చూద్దాం.. మరికొంత కాలం ఆగుదా"మంటూ ఎంతకాలం వాయిదా వేస్తే, భుజాలపై బాధ్యతల బరువు అంతగా పేరుకుపోతుంది. వయసుతో పాటు అవకాశాల తలుపులు ఒక్కొక్కటిగా మూసుకుపోతాయి. "ఇది తాత్కాలికమే.. కొద్దిరోజులే" అనుకుంటూ సర్దుకుపోయిన పరిస్థితులే, కాలం గడిచేకొద్దీ శాశ్వత జీవితంగా స్థిరపడిపోతాయి. అప్పుడిక మిగిలేది నిట్టూర్పులే. గుర్తుపెట్టుకోండి - అనుకూల సమయమంటూ ఎప్పటికీ రాదు; ఉన్న సమయాన్ని అనుకూలంగా మార్చడమే వివేకం. కోరుకున్న మార్గంవైపు తొలి అడుగు వేయడానికి ఈ క్షణమే సరైన ముహూర్తం. చిన్న అడుగైనా సరే, ఇప్పుడే వేయండి. ఎందుకంటే జీవితం వాయిదాల్లో కాదు, ఆచరణలో వికసిస్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# భయపెట్టే 'డైనోకొండ'



ప్రపంచంలోనే అత్యంత భయానక థ్రిల్ రైడ్‌గా పేరుమోసిన 'డైనోకొండ' రోలర్‌కోస్టర్ చైనాలోని జిన్‌బెయ్ నగర 'చైనా డైనోసార్ పార్క్'లో సాహసప్రియులను ఊపిరి బిగబట్టేలా చేస్తోంది. అమెరికాలోని ఉటా రాష్ట్రానికి చెందిన ఎస్ అండ్ ఎస్ వరల్డ్‌వైడ్ సంస్థ నిర్మించిన ఈ రైడ్‌ను ప్రముఖ డిజైనర్ అలన్ షిల్కే రూపొందించారు. 2012లో ప్రారంభమైన ఇది చైనాలో తొలి 4డీ రోలర్‌కోస్టర్ కావడం విశేషం. సుమారు 3,500 అడుగుల పొడవైన ట్రాక్‌పై గంటకు 78 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ రైల్, ప్రయాణికులను ఐదు రెట్ల గురుత్వాకర్షణ శక్తికి గురిచేస్తూ, తలకిందులుగా గిర్రున తిప్పేస్తుంది. అసలు ప్రత్యేకత ఏమిటంటే -- ఇందులోని సీట్లు ట్రాక్‌తో సంబంధం లేకుండా స్వతంత్రంగా తిరుగుతాయి. దీంతో ఏ క్షణంలో ఏ దిక్కుకు విసిరేస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రతి రైడ్ అనుభవం భిన్నంగా ఉండటంతో, కరడుగట్టిన కోస్టర్ అభిమానులకు సైతం ఇది వణుకు పుట్టిస్తోంది. నిజమైన సాహస అనుభవం కోరుకునేవారికి ఇది తప్పక ప్రయత్నించాల్సిన రైడ్ అన్నది పర్యాటకుల మాట.

# భారత్ 285 ఆలౌట్

## మెరిసిన స్మృతి, హర్మన్, దీప్తి
## ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 21/1
## లార్డ్స్‌లో మహిళల ఏకైక టెస్టు



**లండన్:** మహిళల టి20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే వైదొలిగిన భారత క్రికెట్ జట్టు... ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టులో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. సుదీర్ఘ చరిత్ర గల లార్డ్స్ మైదానంలో జరుగుతున్న మహిళల తొలి టెస్టులో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా ఫర్వాలేదనిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్మృతి మంధాన (108 బంతుల్లో 83; 11 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (121 బంతుల్లో 58; 7 ఫోర్లు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (87 బంతుల్లో 57; 7 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించారు. ఈ ముగ్గురు సీనియర్ ప్లేయర్లు ఆచితూచి ఆడగా... మిగిలినవాళ్లు ఎక్కువసేపు నిలవలేకపోయారు. షఫాలీ వర్మ (0) డకౌట్ కాగా... యస్తిక భాటియా (12), రిచా ఘోష్ (13), స్నేహ్ రాణా (13) విఫలమయ్యారు. జెమీమా రోడ్రిగ్స్ (38 బంతుల్లో 35; 5 ఫోర్లు) వేగంగా ఆడింది. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3 వికెట్లు పడగొట్టగా... లౌరన్ ఫిలెర్, ఇస్సీ వాంగ్, మ్యాడీ విలియర్స్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న ఆతిథ్య జట్టు... టీమిండియా స్కోరుకు ఇంకా 264 పరుగులు వెనుకబడి ఉంది. కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న టామీ బ్యూమాంట్ (2) విఫలం కాగా... మైయా (17 బ్యాటింగ్), హీతర్ నైట్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీసింది. ఈ మ్యాచ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసింది. మ్యాచ్ ఆరంభానికి ముందు శ్రీచరణికి వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టెస్టు క్యాప్ అందజేసింది.

# స్పోర్ట్స్

## ఫైనల్లో హైదరాబాద్



**హైదరాబాద్ :** కెప్టెన్ అభిరథ్ రెడ్డి (49 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 82) దంచికొట్టడంతో టీజీ 20 లీగ్‌లో హైదరాబాద్ ఈ చాంపియన్స్ ఫైనల్ చేరుకుంది. లీగ్ దశలో ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి క్వాలిఫయర్-1లో ఓడిన హైదరాబాద్.. రెండో క్వాలిఫయర్‌లో మాత్రం పంజా విసిరింది. ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో కరీంనగర్ డైమండ్స్‌ను ఓడించింది. డైమండ్స్ ఇచ్చిన 158 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిరథ్‌తో పాటు వికాస్ రెడ్డి (45) కూడా రాణించాడు. తొలుత కరీంనగర్ డైమండ్స్ 20 ఓవర్లలో 157/7 స్కోరు చేసింది. హృషికేశ్ సింహా (38), శుభమ్ శర్మ (31 నాటౌట్) టాప్ స్కోరర్లు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్ దేవ్‌గౌడ్, అశ్విన్, ప్రణవ్, తలో మూడు వికెట్లు పడగొట్టారు. అభిరథ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఖమ్మం ఏసెస్‌తో హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది.

# నేడు ఇంగ్లండ్‌తో భారత్ చివరి టి20

సౌతాంప్టన్: ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో తొలి విజయం కోసం నిరీక్షిస్తున్న భారత క్రికెట్ జట్టు నేడు ఇంగ్లండ్‌తో ఆఖరి టి20 మ్యాచ్ ఆడనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టి20 వర్షంతో రద్దు కాగా... ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా పరాజయం పాలైంది. దీంతో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 3--0తో సిరీస్ సొంతం చేసుకుంది. మరి శనివారం నామమాత్రమైన చివరి మ్యాచ్‌లోనైనా మనవాళ్లకు ఊరట విజయం దక్కుతుందా చూడాలి. ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు... ఇప్పుడు కనీస ప్రతిఘటన కనబర్చలేని స్థాయికి చేరింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో మనవాళ్లు ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్నారు. ఐపీఎల్ ప్రదర్శనతో జట్టులోకి వస్తున్న ఆటగాళ్లెవరూ... అంతర్జాతీయ స్థాయిలో అదే దూకుడు కనబర్చలేకపోతున్నారు. ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన నిబంధనల మధ్య ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ప్లేయర్లంతా... ఇప్పుడు అనామకులుగా దర్శనమిస్తున్నారు. .

**నిలకడగా...**

మరోవైపు ఇంగ్లండ్ అన్ని రంగాల్లో బలంగా కనిపిస్తోంది. పేసర్లు ఆర్చర్, టంగ్, స్యామ్ కరన్... భారత బ్యాటర్ల బలహీనతలను పసిగట్టి వారిని సులువుగా బుట్టలో వేసుకుంటున్నారు. ఇక బ్యాటింగ్‌లో



ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల సమర్థులు ఉండటం ఇంగ్లండ్ జట్టుకు కలిసొచ్చే అంశం. ఇప్పటి వరకు ఒకటి కంటే ఎక్కువ టి20 మ్యాచ్‌ల సిరీస్‌ల్లో ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోని టీమిండియా... ఇప్పుడు 'క్లీన్ స్వీప్' ప్రమాదం అంచున ఉంది.

# వరుస ఫ్లాప్స్ లో వున్న హీరోలకు అదృష్టం తెచ్చిన దర్శకులు!

ఆకర్షణీయమైన రత్న వర్ణాల దుస్తుల్లో మెరిసిపోతున్న సంయుక్త





సినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు చాలా సహజం. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కొన్నిసార్లు వరుస పరాజయాలతో సతమతమవ్వక తప్పదు. అలాంటి క్లిష్ట సమయంలో కొందరు ట్రెండింగ్ దర్శకులు తమ అద్భుతమైన టేకింగ్, పవర్ ఫుల్ మాస్ కథలతో ఆ హీరోలకు ఊహించని రేంజ్ లో కం బ్యాక్ ఇచ్చారు. థియేటర్లలో పూనకాలు తెప్పించి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఆ క్రేజీ కాంబినేషన్ల విశేషాలు ఇప్పుడు చూద్దాం.

**పవన్ కళ్యాణ్ రేంజ్ మార్చిన 'గబ్బర్ సింగ్':** 'తీన్ మార్', 'పంజా' లాంటి వరుస పరాజయాలతో పవన్ కళ్యాణ్ కెరీర్ కొంచెం డల్ గా సాగుతున్న టైమ్ అది. ఫ్యాన్స్ అంతా ఒక సాలిడ్ హిట్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇక సరిగ్గా అప్పుడే దర్శకుడు హరీష్ శంకర్ ఎంట్రీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ స్వాగ్‌ను, ఇమేజ్‌ను పర్ఫెక్ట్ గా వాడుకుంటూ ఆయన చేసిన మ్యాజిక్కే 'గబ్బర్ సింగ్' (2012)మూవీ. ఇక థియేటర్లలో మాస్ ఎలివేషన్లతో రచ్చ లేపిన ఈ సినిమా, ఇండస్ట్రీ హిట్ గా నిలిచి పవన్ కు గ్రాండ్ కం బ్యాక్ ఇచ్చింది.

**బాలయ్య మాస్ పవర్ చూపించిన 'అఖండ':**

నందమూరి బాలకృష్ణకు మాస్ లో ఉన్న ఫాలోయింగ్ ప్రత్యేకమైనది. అయితే 'కథానాయకుడు', 'మహానాయకుడు', 'రూలర్' వంటి వరుస ఫ్లాపులతో ఆయన కెరీర్ కాస్త ఇబ్బందుల్లో పడింది. అలాంటి టైంలో బాలయ్య నమ్మకమైన దర్శకుడు బోయపాటి శ్రీను రంగంలోకి దిగారు. ఇక వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' (2021) టాలీవుడ్ ను ఊపేసింది. అఘోరా పాత్రలో బాలయ్య విశ్వరూపం, బోయపాటి హై-వోల్టేజ్ యాక్షన్ సీన్లు సినిమాను బ్లాక్ బస్టర్ గా నిలబెట్టాయి.

**నాగార్జున ట్రెండ్ సెట్టర్ 'శివ':**

అక్కినేని నాగార్జున కెరీర్ మొదట్లో 'నిర్ణయం', 'చైతన్య' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కెరీర్ కాస్త డీలా పడిన తరుణంలో, ఒక కొత్త దర్శకుడు టాలీవుడ్ హిస్టరీని తిరగరాశాడు. ఆయనే రామ్ గోపాల్ వర్మ. 1989లో వచ్చిన 'శివ' సినిమా అప్పటివరకు ఉన్న కమర్షియల్ ట్రెండ్‌ను పూర్తిగా మార్చేసింది. ఇక సైకిల్ చైన్ సీన్, రియలిస్టిక్ యాక్షన్ తో ఈ సినిమా నాగార్జునను రాత్రికి రాత్రే యూత్ ఐకాన్ గా మార్చేసింది.

**రవితేజ ఎనర్జీని పెంచిన 'క్రాక్':**

మాస్ మహారాజా రవితేజ వరుసగా 'టచ్ చేసి చూడు', 'నేల టిక్కెట్టు', 'అమర్ అక్బర్ ఆంథోనీ' వంటి డిజాస్టర్లతో ఫామ్ కోల్పోయారు. ఆయన ఎనర్జీకి తగ్గ హిట్ పడట్లేదని ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నప్పుడు, దర్శకుడు గోపీచంద్ మలినేని తోడుండటంతో సీన్ మారింది. ఇక 2021లో వచ్చిన 'క్రాక్' సినిమాలో పోతురాజు వీరశంకర్ గా రవితేజ పవర్ఫుల్ పోలీస్ క్యారెక్టర్ లో అదరగొట్టారు. ఈ సినిమా రవితేజ కెరీర్ లోనే బెస్ట్ హిట్లలో ఒకటిగా నిలిచింది.

**ఎన్టీఆర్ బాక్సాఫీస్ వేట 'జనతా గ్యారేజ్':**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కు నటనలో తిరుగులేదు, కానీ 'రామయ్యా వస్తావయ్యా', 'రభస' వంటి సినిమాలు నిరాశపరచడంతో ఆయన మార్కెట్ పై ప్రభావం పడింది. ఆ సమయంలో దర్శకుడు కొరటాల శివ ఎన్టీఆర్ కు ఒక డిఫరెంట్ స్క్రిప్ట్ ఇచ్చారు. అదే 'జనతా గ్యారేజ్' (2016). ఎన్టీఆర్‌ను కేవలం మాస్ హీరోగానే కాకుండా, పర్యావరణంపై బాధ్యత ఉన్న పాత్రలో చాలా హుందాగా చూపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి, ఎన్టీఆర్ కు ఘనవిజయాన్ని అందించింది.

వరుస ఫ్లాపులు వచ్చినా, సరైన కథ మరియు దర్శకుడు దొరికితే హీరోల క్రేజ్ మళ్లీ ఎక్కడికో వెళ్తుందని ఈ సినిమాలు నిరూపించాయి. టాలెంట్ ఉన్న దర్శకులు హీరోల ఇమేజ్ కు తగ్గట్టుగా ప్లాన్ చేస్తే థియేటర్లలో ఎలాంటి సంచలనాలు సృష్టించవచ్చో ఈ కాంబినేషన్లే మనకు బెస్ట్ ఎగ్జాంపుల్స్. అందుకే సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి టైమ్ మారుతుందో చెప్పడం కష్టం.



బీచ్‌లో సూర్యాస్తమయ కాంతిలో శమా సికందర్ ఆకర్షణీయమైన రూపం

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com